PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 16.08.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 11 పేజీలు : 12, వెల : ₹ 4


Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# ఉగ్రరూపమెత్తిన ఉద్యమం

- సకలంబంద్‌తో స్థంభించిన రాష్ట్రం
- విధులను వదిలి వీధుల్లోకి జనం
- సంస్థలన్నీ మూత... ఆదాయానికి కోత
- పెరుగుతున్న ఆర్థికభారం... కేంద్రందే ఈ నేరం

పుస్తకాలు పట్టాల్సిన పిల్లలు పిడికిళ్లు బిగించారు... పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఉగ్రరూపమెత్తారు. పొలాల్లో నాట్లు వేయాల్సిన రైతులు కొడవళ్లు చేతపట్టి కదన రంగానికి దూకారు. తీరికలేకుండా విధినిర్వహణలో వుండాల్సిన ఉద్యోగులు వీధుల్లోకి వచ్చారు. బస్సులు నడపాల్సిన డ్రైవర్లు పోరాటాన్ని ముందుకు నడుపుతున్నారు. టిక్కెట్లు కొట్టాల్సిన కండక్టర్లు కన్నెర్రజేసారు. కండక్టర్ నుండి కలెక్టర్ దాకా, వాచ్‌మెన్ నుండి బిజినెస్‌మెన్ దాకా, అటెండర్ మొదలుకొని ఆడిటర్ దాకా ట్రాక్టర్ నడిపే డ్రైవర్ నుండి వైద్యం చేసే డాక్టర్ దాకా... అందరూ ఉక్కు పిడికిలి బిగించి "జై సమైక్యాంధ్ర" అంటున్నారు. గల్లీగల్లీనా సమైక్యాంధ్ర నినాదాలు మార్మోగుతుంటే ఢిల్లీలోని సోనియా, మన్మోహన్, దిగ్విజయ్‌లు మాత్రం గాంధీజీ మూడుకోతుల మాదిరిగా మంచిని వినకు, సీమాంధ్రుల బాధ చూడకు, ఆంధ్రులను కలిసుండమని చెప్పకు అన్నట్లు చెవులు, నోరు, కళ్లు మూసుకునివున్నారు.

ఓ పక్క స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నాం. మరోపక్క సీమాంధ్రలో మరోస్వాతంత్ర్య సమరం జరుగుతున్నట్లుగా వుంది వాతావరణం. సోనియాగాంధీ పెట్టిన తెలంగాణ చిచ్చుతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారింది. తడ నుండి ఇచ్ఛాపురం దాకా, సత్యవేడు నుండి పల్నాడు దాకా 13సీమాంధ్ర జిల్లాలు సమైక్యాంధ్ర ఉద్యమంతో అట్టుడికి పోతున్నాయి. ఏపి ఎన్‌జిఓలు సకలజనుల సమ్మెకు (మిగతా 10వ పేజీలో)



# మహానగరంలో... మోడీ మోత!

(వివరాలు 12వ పేజీలో)



# చేసిందంతాచేసి... మహానేతపై నిందలా?



కాంగ్రెస్‌పార్టీ అతి కిరాతకమైన రాజకీయాలు చేస్తుంది. నీచ, నికృష్టపు పనులకు ఒడిగడుతుంది. అధికారం కోసం పచ్చిఅబద్ధాలాడుతోంది. నీతిమాలిన ఒరవడికి శ్రీకారం చుట్టింది. (మిగతా 10వ పేజీలో)

# వికటించిన... 'రెండుకళ్ల' ఆపరేషన్



రాజకీయాలలో స్థిరత్వం, ధృఢమైన నిర్ణయం అంటూ లేకపోతే నష్టం తీవ్రంగా వుంటుంది. పరిస్థితులకు తగ్గట్లు వెంటనే నిర్ణయం తీసుకోలేకపోయినా దాని ప్రభావం ఎక్కువుగానే వుంటుంది. రాష్ట్ర విభజన నిర్ణయం మూలంగా రాష్ట్రంలో ఎక్కువుగా నష్టపోతున్న పార్టీ తెలుగుదేశమే. దీనికి ప్రధాన కారణం ఆయన వల్లించిన రెండుకళ్ల సిద్ధాంతమే!

తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంలో నుండి పుట్టింది తెలుగుదేశంపార్టీ. దీని వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు పూర్తిగా సమైక్యవాది. ఆయన వున్నంతకాలం ప్రత్యేకతెలంగాణ సమస్యే రాలేదు. చంద్రబాబు కూడా చాలాకాలం సమైక్యవాదిగానే నిలిచాడు. తాను ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కూడా ప్రత్యేక తెలంగాణవాదాన్ని తొక్కిపెట్టాడు. 2004లో కాంగ్రెస్ టీఆర్‌ఎస్‌తో పొత్తుపెట్టుకుని పోటీచేసింది. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వై.యస్. సీఎం అయ్యాడు. టీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నా కూడా వై.యస్. తెలంగాణ వాదాన్ని ఎదగనీయలేదు. 2009 ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు, టీఆర్‌ఎస్‌కు బాగా పడిపోయింది. ఈ సమయంలో చంద్రబాబుకు ఏం దుర్బుద్ధి పుట్టిందో ఏమో పోయిపోయి టీఆర్‌ఎస్‌తో (మిగతా 10వ పేజీలో)

PDF Compressor Free Version





# విద్యార్థులే ఉద్యమ సారధులు

సమైక్యాంధ్ర ఉద్యమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అంతంత మాత్రంగా వుంటుంది. విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య ప్రజానీకంలో వున్నంత ఆవేదన నాయకుల్లో కనిపించడం లేదు. విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛంధంగా ఉద్యమం బాట పడుతుంటే, నాయకులు మాత్రం ప్రజల దెబ్బకు భయపడి ఉద్యమాల్లోకి వస్తున్నారు.

రాష్ట్ర విభజనకు నిరసనగా జిల్లాలోని నెల్లూరు ఎంపీతో పాటు ముగ్గురు కాంగ్రెస్, నలుగురు తెలుగుదేశం, ఇద్దరు వైకాపా ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామాలు సమర్పించడం జరిగింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యంలు రాజీనామాలు చేయలేదు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమైక్యాంధ్ర ఆందోళనలకు దూరంగా వుంటున్నారు. 2009 డిసెంబర్‌లో జిల్లాలో జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఆనం వివేకానందరెడ్డి, ఇప్పుడు ఆ బాధ్యతలను నిర్వర్తించలేక పోతున్నారు. ఆరోగ్యకారణమో, మరే కారణమోగాని మునుపటిలా ఉత్సాహంగా లేదు. నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అంతే... ఆదాల ప్రభాకర్ రెడ్డి అయితే రాజీనామా అయితే స్పీడ్‌గా చేసాడుగాని ప్రత్యక్ష ఉద్యమాలలోకి రాలేదు.

గతంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమైక్యాంధ్ర ఉద్యమంలో చురుగ్గా వుండేవాడు. ఈరోజు వాళ్ల పార్టీ అధినేత చంద్రబాబు తీసుకున్న తెలంగాణ అనుకూల నిర్ణయం కారణంగా సోమిరెడ్డి ఏమీ మాట్లాడలేకున్నాడు. తెలుగుదేశంలో మిగతా నాయకులు అంత చురుకుగా పాల్గొనడం లేదు.

సమైక్యాంధ్ర ఉద్యమంలో కొంత హుషారుగా పాల్గొంటున్నది వైయస్సార్ కాంగ్రెస్‌నాయకులే! సమైక్యాంధ్రకు అనుకూలంగా ఆ పార్టీ అధిష్టానమే నిర్ణయం తీసుకోవడంతో వైకాపా నాయకులకు రూట్ క్లియర్ అయ్యింది. దాంతో ఆ పార్టీ నాయకుల వరకు ఉద్యమంలోకి బాగానే వస్తున్నారు. మొత్తానికి 2009 డిసెంబర్‌తో పోలిస్తే నేటి సమైక్యాంధ్ర ఉద్యమంలో నాయకుల పాత్ర బాగా తగ్గింది.

• తేలేదాకా...

# ఎన్నికలకు ఆగాల్సిందే!



పంచాయితీల ఎన్నికలు అయిపోగానే మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమైపోయింది. ఈ నెలలోనే మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడి, వచ్చే నెల ప్రథమార్థంలోనే ఎన్నికలను నిర్వహించాలి. పంచాయితీ ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియనంతా పూర్తి చేసారు. వార్డుల రిజర్వేషన్ల తంతు ముగిసింది. ఓటర్ల జాబితా తయారైంది. ఏ మున్సిపాలిటీలో ఏ వార్డు ఏ కేటగిరి క్రింద రిజర్వయ్యిందో కూడా వెల్లడించారు. కాని ఈలోపే సీమాంధ్ర ఉద్యమం రాజుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వమే నడవడం లేదు. ఎన్జీఓల నిరవధికసమ్మెతో పాలనే స్థంభించిపోయింది. అసలు రాష్ట్రంలో ప్రభుత్వమే వుంటుందో లేక రాష్ట్రపతి పాలన వస్తుందో తెలియని ఈ పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు కష్టమే.




# నెల్లూరులో అష్టదిగ్బంధం

నెల్లూరు నగరమంటేనే ముందుగా గుర్తొచ్చేది ట్రాఫిక్ సమస్యలు. నగరంలో జీఎన్‌టిరోడ్డు మీద ఎక్కువ వాహనాలు నడుస్తున్నందువల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వుండడం తెలిసిందే! నగరంలో ప్రత్యామ్నాయ రోడ్లు లేనందువల్లే జీఎన్‌టిరోడ్డు మీద ట్రాఫిక్ ఎక్కువగా వుంటుంది.

ఈమధ్య మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో నెల్లూరు జంట ఎమ్మెల్యేలు బాగానే నిధులు తెచ్చి కొన్ని రోడ్లను వెడల్పు చేయించారు. ఇంతవరకు బాగానే వుంది. మున్సిపల్ ఎన్నికలొస్తే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి మంజూరైన రోడ్ల పనులు ఆగిపోతాయనుకున్నారో ఏమో నగరంలో మంజూరైవున్న రోడ్ల పనులన్నింటిని ఒకేసారి మొదలుపెట్టారు. దీంతో నగరమే అష్టదిగ్బంధనం చేసినట్లయ్యింది. ఓ పక్క రోడ్ల నిర్మాణం, మరో పక్క సమైక్యాంధ్ర ధర్నాలతో నిలిచిపోతున్న ట్రాఫిక్ వాహనదారులకు సినిమా చూపిస్తున్నాయి. కెవిఆర్ పెట్రోల్‌బంకు వద్ద నుండి మద్రాసుబస్టాండ్ వరకు సిమెంట్‌రోడ్డు నిర్మాణం జరుగుతుంది. దీంతో అయ్యప్పగుడి వైపు నుండి వచ్చే వాహనాలన్నీ మాగుంట లేఅవుట్, మినీ బైపాస్, రామలింగాపురం అండర్‌బ్రిడ్జిల నుండి జీఎన్‌టిరోడ్డులోకి వస్తున్నాయి. అంతకుముందు కొన్ని వాహనాలు కెవిఆర్ పెట్రోల్‌బంకు, పోలీస్ ఆఫీసు, పాత బైపాస్‌ల మీదుగా బోసుబొమ్మ వద్దకు వచ్చేవి. ఇప్పుడు పాత పెద్దాసుపత్రి రోడ్డులో కూడా సిమెంట్‌రోడ్డు పనులు మొదలుపెట్టడంతో ఇటు పోవడం కూడా కష్టంగా మారింది.

ఇప్పుడు నగరంలో మినీబైపాస్ ఒక్కటే ఫ్రీగా వుంది. దీంతో వాహన రద్దీ కూడా ఎక్కువగా వుంది. ఇప్పుడు పెళ్లిళ్ళ సీజన్ కావడంతో వాహనదారులకు రోడ్లపై నరకం కనిపిస్తుంది.

# బందోబస్తులో పోలీసులు...



# తమ పనుల్లో దొంగలు

దాదాపు నెలరోజులుగా పోలీసులు తమ విధులకు దూరమయ్యారు. ఎన్నికలు, ఆందోళనల నేపథ్యంలో విధులకే వారు అంకితమయ్యారు. పోలీసుస్టేషన్‌లలో సి.ఐ, ఎస్.ఐ స్థాయి అధికారులే కనిపించడం లేదు. నెలరోజులుగా పోలీసుస్టేషన్‌లకు సెలవు ప్రకటించినట్లయ్యింది పరిస్థితి. గత నెలలో పంచాయితీ ఎన్నికలు జరిగాయి. జూలై మూడోవారం నుండే పోలీసు అధికారులు పంచాయితీ ఎన్నికల బందోబస్తుపై దృష్టిపెట్టారు. అన్ని పోలీసుస్టేషన్‌లలో కూడా రైటర్‌ను ఓ కానిస్టేబుల్‌ను వుంచి, మిగతా సిబ్బంది, ఎస్ఐ, సిఐ, డిఎస్పీలంతా పంచాయితీ బందోబస్తుకు పోయారు. అప్పుడు పోవడం మొదలు వాళ్లంతా ఇక సాధారణ విధులకు తిరిగి రాలేదు. పంచాయితీ ఎన్నికలు ముగిసేలోపే సమైక్యాంధ్ర ఉద్యమం రాజుకుంది. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన సాయుధదళాలతో పాటు జిల్లా పోలీసులను కూడా ఆందోళనలను అదుపు చేయడానికే వాడుకుంటున్నారు. పోలీసుస్టేషన్‌లకు పోవడం, కేసుల నమోదు, బాధితుల పంచాయితీలు లేకపోవడంతో పోలీసులు కూడా మహాబోర్‌గా ఫీలవుతున్నారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.



# అన్ని పక్షాలు... ఉద్యమ పక్షమే

జిల్లాలోని అన్ని రాజకీయపక్షాలు ఒకే వేదికమీదకు చేరాయి. దిక్కులు పిక్కటిల్లేలా సమైక్యవాదాన్ని వినిపించాయి. సమైక్యాంధ్ర ఉద్యమాన్ని బలోపేతం చేయాలని అన్ని రాజకీయపక్షాలు కూడా తీర్మానించాయి. ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని ఎన్జీఓ హోంలో సమైక్యాంధ్ర విద్యార్థి ఐకాస 14 విశ్వవిద్యాలయాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డి.వి.కృష్ణయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో పాటు జిల్లాలోని వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, చాట్ల నరసింహారావు, బీద రవిచంద్ర, మేరిగ మురళీధర్‌లు పాల్గొన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు తమ జెండాలు, అజెండాలను పక్కనపెట్టి సమైక్యాంధ్రే ధ్యేయంగా పోరాడాలని విద్యార్థి నాయకులు పిలుపునిచ్చారు. ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో మనం ముందుకెళితే పార్లమెంట్‌లో బిల్లు ఆగిపోతుంది. సీమాంధ్ర ప్రజాప్రతినిధులంతా రాజీనామాలు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి. రాష్ట్రం విడిపోతే ముందుగా నష్టపోయేది విద్యార్థులే! రాజకీయనాయకులు ఉద్యమానికి నైతికమద్దతు నందించాలి. స్వాతంత్ర్యోద్యమంలో ఎక్కువమంది తెలుగువారే వున్నారు. అలాంటి తెలుగుజాతిని చీల్చే ప్రయత్నం జరుగుతుందని, ఆ కుట్రను అడ్డుకోవాలని విద్యార్థినాయకులు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుండి హర్షవర్ధన్, కుప్పం ద్రవిడ యూనివర్శిటీ నుండి రవీందర్, ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి నూకరాజు, ప్రకాశంజిల్లా నుండి జగదీష్, నాగార్జున విశ్వవిద్యాలయం నుండి అశోక్, వేమన విశ్వవిద్యాలయం నుండి రవిశంకర్‌రెడ్డి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుండి శ్రీనివాసులురెడ్డి, కర్నూలు నుండి అమర్, ఎస్వీయూనివర్శిటీ నుండి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# మురిసిన మువ్వన్నెల జెండా



జాతీయపతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఈ నెల 15వ తేదీన భారత 67వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా అంతటా ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. సమైక్యాంధ్ర సమ్మెలో పాల్గొంటున్న ఎన్జీఓలు, విద్యార్థులు స్వాతంత్ర్య వేడుకలకు మాత్రం హాజరుకావడంతో వేడుకలకు ఎటువంటి అంతరాయం కలుగలేదు. నెల్లూరులోని పోలీస్‌పరేడ్

## ఘనంగా 67వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శకటాల ప్రదర్శన

గ్రౌండ్‌లో జరిగిన వేడుకలలో రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించి వందనం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగధనుల స్ఫూర్తితో సిద్ధించిన ఈ స్వాతంత్ర్య ఫలాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమపథకాలను గురించి ఆయన సమగ్రంగా వివరించారు. ఈ వేడుకలలో వివిధ పాఠశాలల చిన్నారులు ప్రదర్శించిన దేశభక్తి కార్య క్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే వివిధ ప్రభుత్వశాఖలు రూపొందించిన శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా సాగింది. వివిధ రంగాలలో సేవలందించిన అధికారులు, సిబ్బంది, కళారంగాల వారికి మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు.



ప్రశాంతి మున్సిపల్ హైస్కూల్‌లో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు



రోటరీ ఆడిటోరియంలో...

ఈ వేడుకలకు శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బీద మస్తాన్‌రావు, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, జిల్లా జడ్జి శ్రీరామ్మూర్తి, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణ జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, అదనపు జాయింట్ కలెక్టర్ సి. హెచ్. పెంచలరెడ్డి, డిఆర్‌ఓ బి.రామి రెడ్డి, ఆర్డీవో మాధవీలత, వివిధశాఖల అధికారులు హాజరయ్యారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో జాతీయ పతాకాలను ఆవిష్కరించి స్వీట్లు పంచారు.



రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో జాతీయపతాకావిష్కరణ

## నెల్లూరు ఫోటోగ్రాఫర్లకు అవార్డులు





నెల్లూరు ఈనాడు ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న ఎస్.హరిగంగాధర్‌కు, సాక్షి ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న ముత్యాల వెంకటరమణకు రాష్ట్రస్థాయి ప్రోత్సాహక బహుమతులు లభించాయి.

174వ ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఫోటోగ్రాఫర్లను ఎంపికచేసింది. ఇందులో భాగంగా హరిగంగాధర్, ముత్యాల వెంకటరమణలు తీసిన ఫోటోలు ఎంపికయ్యాయి. ఉత్తమవార్తచిత్రం క్రింద ప్రోత్సాహక బహుమతులు ప్రశంసాపత్రాలు నగదు బహుమతులను వీరు అందుకున్నారు. గతంలోను వీరుతీసిన ఉత్తమ ఛాయాచిత్రాలకు బహుమతులు అందుకున్నారు. హరిగంగాధర్, వెంకటరమణలు అవార్డులకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర విభజన వద్దు... సమైక్యమే ముద్దు

### -- పోలీసు కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బంది నిరసన --



రాష్ట్రాన్ని విభజించొద్దని, సమైక్యంగా ఉంచాలంటూ నెల్లూరుజిల్లా పోలీసు కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బంది బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సకలజనుల సమ్మెలో భాగంగా ఉద్యోగులు విధులను బహిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కెవిఆర్ పెట్రోలుబంకు మీదుగా నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రాజకీయస్వార్థం వేర్పాటువాదంతో రాష్ట్రం రెండుముక్కలవుతోందన్నారు. మెజార్టీ ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా ఏకపక్షంగా విభజన ప్రక్రియకు పూనుకోవడం దారుణమన్నారు. రాష్ట్రం విడిపోతే అభివృద్ధి జరగదని సమైక్యాంధ్ర కోసం ప్రజలు సదుంటిగించాలన్నారు. ఏపీఎన్జీఓ ఇచ్చిన పిలుపుమేరకు సమ్మెలో తాము భాగస్వాములమయ్యామన్నారు.

## పాపం ఆ పార్టీలదే!



కాకాణిని స్వాగతిస్తున్న నేతలు

విభజన పాపం కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలదేనని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. 14వ తేదీన మనుబోలు పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీలు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరితోనే రాష్ట్రం తగలబడుతుందన్నారు. ప్రస్తుతం ఆ రెండుపార్టీలు కూడా ఉద్యమంలో పాల్గొంటుండడం శోచనీయమన్నారు. సీమాంధ్రుల స్వేదంతో హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, ఇప్పుడు హైదరాబాద్‌పై సీమాంధ్రులకు హక్కు లేకుండా చేయడానికి అది సోనియా జాగీర్ కాదన్నారు.


ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక వైకాపా నేతలు పాల్గొన్నారు.

## facebookలో ఈ వారం

### స్వామిభక్తి

సమైక్యాంధ్ర ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్నా పట్టించుకోని చిరంజీవి సోనియాగాంధీకి ఎంతగా వీరవిధేయుడుగా మారాడో చిత్రిస్తూ... ఓ సమైక్యాంధ్రవాది పంపిన ఫోటో.

### చిరంజీవి 150వ సినిమా




### అడ్డురాని వైకల్యం

కంట్లో ఆశ, ఒంట్లో ఆశయం వుంటే పనిచేయడానికి వైకల్యం అడ్డురాదని సూచిస్తూ కెరీర్ అడ్డా నెట్‌వర్క్ షేర్‌చేసిన ఓ స్ఫూర్తిదాయకమైన చిత్రం.






### పెద్దమనిషి పంచాయతీ

డిగ్విజయ్‌సింగ్ ఈ రాష్ట్ర విభజనను ఎంత పక్షపాత ధోరణితో చేసాడో ఈ చిత్రం వివరిస్తుంది. ఆవు పొదుగును తెలంగాణవాళ్లకిచ్చి, పాలు పిండుకోమన్నట్లు, తల భాగం సీమాంధ్రులకిచ్చి మేత వేయమన్నట్లున్న ఈ చిత్రాన్ని ప్రవీణ్‌కుమార్ షేర్ చేసారు.



### వంట మస్టార్

చారబాట్లు, విభజనలతో దేశం అట్టుడికిపోతుంటే ప్రధాని మన్మోహన్ సింగ్ మాత్రం పానీపూరీలు చేసుకుంటున్నట్లున్న ఈ ఫోటోను ఫన్నీ ఇండియన్ ఇమేజ్ గ్యాలరీ షేర్‌చేసింది.

### తెలంగాణ దేవదాసు

కేసీఆర్‌కు మద్యం బాగా సేవిస్తాడనే పేరుంది. ఆయన తాగి రోడ్లమీద ఎక్కడంటే అక్కడ పడిపోతాడని వ్యంగ్యంగా పేర్కొంటూ భాస్కర్‌నాయుడు షేర్ చేసిన ఫోటో.



PDF Compressor Free Version






## వ్యా(కులం)

సమాజవాదీ పార్టీ నాయకుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ తన తండ్రి ములాయంసింగ్ యాదవ్‌ని ప్రధానమంత్రిగా చేయమని యాదవులందరికీ పిలుపునిచ్చారు. కులమత రహిత లౌకిక ప్రజాస్వామ్య భారతదేశ ప్రధాని ఎంపికలో కులప్రస్తావన రావడం దురదృష్టకరం. కులప్రస్తావనలు తెస్తే అంతా వ్యాకులమే!

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## మోడీ సభ సూపర్

ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన నరేంద్రమోడీ బహిరంగ సభకు ప్రజలు పోటెత్తినట్లు వచ్చారు. మోడీ పట్ల ప్రజలలో వున్న అభిమానానికి ఈ సభ నిదర్శనం. సభలో మోడీ పనికిమాలిన రాజకీయ విమర్శల జోలికి పోలేదు. వ్యక్తిగత విమర్శలు, మతవాదం గురించి మాట్లాడలేదు. దేశాభివృద్ధి, దేశ రక్షణ గురించే ప్రజలను ఆలోచింపజేసే విధంగా మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. దేశానికి ప్రధాని కాగల అర్హతలు నరేంద్రమోడీకే వున్నాయి.

సి.రాజీవి, నెల్లూరు.

## వాయిదా వేయాలి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను కొంతకాలమన్నా వాయిదా వేయాలి. లేకుంటే సీమాంధ్రలో ఆందోళనలు ఆగే పరిస్థితి లేదు. జన జీవనం పూర్తిగా స్థంభించిపోయింది. సీమాంధ్రకు ఏ రూపాన న్యాయం చేస్తారో సమగ్రంగా చెప్పాకే విభజనపై నిర్ణయం తీసుకోవాలి.

వి.వి.కృష్ణప్రసాద్,
వెంకటగిరి.

## నగరం అస్తవ్యస్థం

నెల్లూరు నగరంలో 6లక్షల జనాభా, 54డివిజన్‌లు, 2వేల అపార్ట్‌మెంట్లు, లక్షా60వేల ఇళ్ళు వున్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌పై ఎవరికీ అవగాహన లేదు. ట్రాఫిక్ అయోమయంగా వుంది. రోడ్ల మీద వ్యర్థపదార్థాలు, పందులు, కుక్కలు పరిమితులు లేకుండా తిరుగుతున్నాయి. రోడ్లన్నీ మురికి కంపు కొడుతున్నాయి.

వాస్తు రామచంద్రరావు, నెల్లూరు.

## 'ప్రభా'తం

పాకిస్థాన్ తన దరిద్రంకొద్దీ అమెరికా పక్కనే వుందనుకుందాం. పాక్ సైనికులు అత్యుత్సాహంతో అమెరికా భూభాగంలోకి జొరబడి ఓ 5మంది అమెరికన్ సైనికులను హతమార్చారనుకోండి... వెంటనే ఏం జరుగుతుంది. పాకిస్థాన్ పైపు విమానం మోత మోగుతుంది. బాంబులు, క్షిపణుల మోతలతో పాకిస్థాన్ దద్దరిల్లుతుంది. అమెరికా చట్టసభలలో అధికార, ప్రతిపక్షసభ్యులంతా ఒక తాటిమీదకొచ్చి మన సైనికులను చంపిన పాకిస్థాన్ తాట వలిచి తీరాల్సిందేనని తీర్మానిస్తారు. పాకిస్థాన్ అధ్యక్షుడు, ప్రధానిలను తమ వద్దకే పిలిపించుకుని చేసిన తప్పుకు గుంజీలు తీయిస్తారు.

సరే, అమెరికా అగ్రదేశం కాబట్టి ఆ తత్వంతో పాకిస్థాన్‌ను భయపెడుతుందనుకుందాం. మరి మనకంటే చిన్నదేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్‌లను తీసుకుందాం. ఆ దేశ భూభాగాల్లోకి జొరబడి పాకిస్థాన్ వారి సైనికులను చంపివుంటే ప్రతిస్పందన ఎలా వుండేది? ఖచ్చితంగా వాళ్ల స్పందన తీవ్రంగా వుండేది. కన్నుకు కన్ను చావుకు చావు అన్నట్లుగా వుండేది. మరి తమ సైనికులు చనిపోతే చిన్నదేశాలు సైతం ఖచ్చితంగా పౌరుషంతో స్పందిస్తాయి. మరి భారత భూభాగంలోకి పాకిస్థాన్ సైనికులు జొరబడి మన సైనికులు ఐదుగురిని హతమారిస్తే మన ప్రభుత్వ స్పందన ఏమిటంటే... వాళ్లు పాకిస్థాన్ సైనికులు కాదు... సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులని స్వయంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి ఆంటోనీయే చట్టసభలలో చెబితే ఇక ఈ దేశానికి దిక్కెవరు? పాకిస్థాన్ వాళ్లకు కూడా రాని ఐడియాలను ఈ విధంగా చెప్పి తప్పించుకోవచ్చంటూ మన రక్షణ మంత్రే అందిస్తే ఇక దేశాన్ని కాపాడేదెవరు? పార్లమెంటులో ప్రతిపక్షాలు తలంటాక గాని ఆంటోని తన మాటను వెనక్కి తీసుకోలేదు. మన జవానుల ప్రాణాలకు విలువలేదన్నట్లుగా కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలి వుంది. ఒక ఎంపీ అయితే చావడానికే సైనికులు అందులో చేరుతారని మాట్లాడి రాజకీయనాయకుల మందబుద్ధిని బయటపెట్టాడు.

మన సరిహద్దుల్లో చైనా, పాకిస్థాన్‌లు పక్కలో బల్లేలులా వున్నాయి. ఇటీవల కాలంలో ఈ రెండు దేశాల చొరబాట్లు ఎక్కువయ్యాయి. నియంత్రణరేఖని ఉల్లంఘించి చైనా దళాలు చొచ్చుకు రావడం, మన భూభాగంలో స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, మనం ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలను తొలగించడం తరచూ జరుగుతూనే వుంది. చైనాతో మనకు సరిహద్దు వివాదం వుంది. అరుణాచల్‌ప్రదేశ్‌తో సహా మన దేశంలోని కొన్ని ప్రాంతాలను తమవిగా పేర్కొంటూ తరచూ చైనా వివాదాలకు ఆజ్యం పోస్తుంది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో పంచశీల సూత్రాలతో ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్యలను పరిష్కరించుకునే ప్రయత్నం జరిగినా అది సత్ఫలితాలనివ్వలేదు. ఆ సమస్య అలాగే వుంది. చైనా చొరబాట్లు జరుగుతూనే వున్నాయి. అయితే ఇరు దేశాల సైనికుల మధ్య కాల్పులన్నవి చోటుచేసుకోలేదు.

కాని పాకిస్థాన్ అలా కాదు... ఉసిక్కిమంటే కాల్పులకు తెగబడుతోంది. గతంలోనూ పాకిస్థాన్ సైనికులు మన భూభాగంలోకి చొచ్చుకువచ్చి ఇద్దరు సైనికుల తలలు నరికారు. తాజాగా పూంచ్ సెక్టార్‌లో పాకిస్థాన్ సైనికులు భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చి ఐదుగురు సైనికులను హతమార్చారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడల్లా కేంద్రప్రభుత్వ స్పందన కఠినంగా వుండడం లేదు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోమని, మా సహనాన్ని పరీక్షించొద్దని ప్రధాని మన్మోహన్‌సింగ్ రొటీన్‌డైలాగ్ ఒకటి వదులుతాడు. పాకిస్థాన్ వాళ్లు చేసుకునే పనులు చేసుకుంటూనే పోతుంటారు. మన ప్రభుత్వానికి ఇంత చేతగాని తనమేంటన్నదే ప్రశ్న? మనకంటే చిన్నదేశం పట్ల కూడా కఠినంగా వ్యవహరించలేని మన పాలకుల మెతకవైఖరికి కారణమేంటన్నది మాటఇరవై కోట్ల భారతావని ప్రశ్న? 400ఏండ్లు మహ్మదీయుల పాలనలో, 200ఏళ్లు తెల్లదొరల పాలనలో మనకు బానిసజీవితం అలవాటైపోయింది. వాళ్లు పెత్తనం చేస్తుంటే పని చేయడం ఆనవాయితీ అయ్యింది. చివరకు దేశ స్వాతంత్ర్యం కూడా పోరాడికాదు బ్రతిమలాడి తెచ్చుకున్నదే! ఆ విధంగా మెతక వైఖరికి అలవాటుపడ్డాం. బ్రిటీష్‌వారిని బ్రతిమలాడి స్వాతంత్ర్యం తెచ్చామంటున్న కాంగ్రెస్‌పార్టీ ఆ తర్వాత రాజకీయ పార్టీగా అవతారమెత్తింది. ఇలాంటి పార్టీ చేతిలో దేశపాలన వుంది. కాబట్టి ఆ పాలన సమర్థవంతంగా, శక్తివంతంగా వుండాలని కోరుకోవడం మన మూర్ఖత్వమే అవుతుంది. ఓట్ల బ్యాంకు రాజకీయాలు దేశాన్ని శాసిస్తున్నంతకాలం సరిహద్దుల్లో చొరబాట్లు జరుగుతూనే వుంటాయి. మన సైనికులు నేలరాలుతూనే వుంటారు.

కన్నుకు కన్ను కాలుకు కాలు, ఒక తలకు పదితలలు అనే నాయకత్వం వస్తేనేగాని మన శత్రుదేశాలకు వణుకుపుట్టించలేము.

### ఎన్నాళ్లీ సహనం?



సరిహద్దుల్లో చైనా, పాకిస్థాన్ చొరబాట్లు ఆగడంలేదు. వీటి తీరు చూస్తుంటే భారత్‌తో గిలి గిల్లికజ్జాలు పెట్టుకోవాలన్నట్లుగా వుంది. మన భూభాగంలోకి దూరి మన సైనికులని అన్యాయంగా చంపుతుంటే కేంద్రప్రభుత్వం నుండి నామమాత్రపు స్పందన కనిపిస్తుండడం ఆందోళన కలుగజేస్తుంది.

## 'అంతర్'జాతీయం

- రష్యాలోని సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో జరిగిన 11వ నేషనల్ జాగ్రఫిక్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ను భారతీయ అమెరికన్ విద్యార్థుల బృందం చేజిక్కించుకుంది. మొత్తం 17దేశాల బృందాలను ఓడించి గోపీ రామనాథన్(15), ఆశాజైన్(13), నీలంకౌర్‌సంధు(14)ల బృందం ఈ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది.
- ప్రపంచంలో అతిపెద్ద మూడోఆర్థికశక్తి అయిన జపాన్ అప్పుల్లో కూరుకుపోయింది. 10.5ట్రిలియన్ అమెరికా డాలర్ల అప్పులో జపాన్ వుంది.
- భారత భూభాగంలోకి చైనా దళాలు చొచ్చుకొస్తున్న ఘటనలు పెరిగిపోతున్న దృష్ట్యా ఇరు దేశాలు సరిహద్దు విషయంలో ఒక సమగ్ర ఒప్పందాన్ని రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చైనా పర్యటనకు వెళుతున్నందున ఆ ఒప్పందంపై ఇరుదేశాల ప్రధానులు సంతకాలు చేసే అవకాశముంది.
- భారత మోస్ట్‌వాంటెడ్ నేరగాడు దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోనే వున్నాడని తేటతెల్లమైంది. రంజాన్‌పండుగకు రెండురోజుల ముందే అతను కరాచీ నుండి జెద్దాకు వెళ్లాడు. అయితే అతడిని తమ దేశం నుండి వెళ్లగొట్టామని పాక్ చెబుతుంది.
- ఆహారభద్రత చట్టంతో రైతులు తమ పొలాల్లో తామే కూలీలుగా మారే అవకాశముందని, కాబట్టి రైతులు అప్రమత్తంగా వుండాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శరద్‌పవార్ హెచ్చరించారు. ఆహారభద్రత చట్టంపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తమ శాఖ తరపున సంబంధితవర్గాలకు లేఖ వ్రాసినట్లు వెల్లడించారు.
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి విమానవాహక నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్ ఈ నెల 12వ తేదీన జలప్రవేశం చేసింది. కోచి షిప్‌యార్డ్‌లో జరిగిన కార్యక్రమంలో రక్షణశాఖమంత్రి ఏ.కె.ఆంటోని భార్య ఎలిజబెత్ ఈ నౌకను ప్రారంభించారు. ఇంత పరిణామంలో వున్న నౌకలను నిర్మించే సామర్థ్యం అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్‌లకు మాత్రమే వుంది. ఆసియా ఖండంలో చైనాను అధిగమించి భారత్ ఈ నౌకను నిర్మించడం విశేషం.
- జమ్మూకాశ్మీర్‌లోని కిష్వార్‌లో చోటుచేసుకున్న హింస నేపథ్యంలో ఆ రాష్ట్ర హోంమంత్రి అహ్మద్‌కిచ్లూ రాజీనామా చేసారు.
- గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీకి బ్రిటన్‌లో పర్యటించాలని ఆహ్వానం అందింది. బ్రిటన్ దిగువసభ హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఆధునిక భారత భవిష్యత్తు అనే అంశంపై ప్రసంగించాలని విపక్ష లేబర్ పార్టీ ఎంపీ బ్యారీ గార్డినర్ ఆయనకు ఆహ్వానం పంపారు.
- దాణా కుంభకోణం కేసులో లాలూకు ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌లో ఈ కేసును విచారిస్తున్న సిబిఐ ప్రత్యేక జడ్జిని బదిలీ చేయాలంటూ ఆయన చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తోసి పుచ్చింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- ఎన్నికల కోసమే తెలంగాణ ప్రకటన. - కాంగ్రెస్‌పై అద్వానీ ధ్వజం.
వ్యాఖ్య :- *మరి ఎన్నికలప్పుడు కూడా ఏదో ఒకటి చేయకుంటే ఎలా?*

వార్త :- మోడీ అధికారదాహాన్ని అడ్డుకోవాలి. - వరవరరావు.
వ్యాఖ్య :- *ఈ దేశంలో అధికారదాహం లేని నాయకుడెవరో మీరే చూపండి.*

వార్త :- వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం. - కేంద్రమంత్రి సర్వే.
వ్యాఖ్య :- *ఈ దేశంలో పెద్ద వ్యర్థంగా వుండేది రాజకీయ నాయకులే!*

వార్త :- ప్రాంతీయపార్టీలకు ఉజ్వలభవిత. - సీపీఐ కార్యదర్శి బర్దన్.
వ్యాఖ్య :- *అందుకేనా మీరు జాతీయపార్టీని ప్రాంతీయపార్టీ స్థాయికి తీసుకొచ్చారు.*

వార్త :- రాజీనామాల ఆమోదానికి గడువేమీలేదు. - లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్.
వ్యాఖ్య :- *మళ్లీ ఎలక్షన్‌లు లోపు ఎప్పుడైనా ఆమోదించుకోవచ్చంటారు.*

వార్త :- మళ్లీ 'వస్తున్నా మీ కోసం'. - తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం బాబు బస్సుయాత్ర.
వ్యాఖ్య :- *ఒక యాత్రకే తెలుగుతమ్ముళ్లు అరిపోయారు... మళ్లీనా?*

వార్త :- పార్లమెంట్ వేదికగా విభజనను అడ్డుకుంటాం. - ఉండవల్లి.
వ్యాఖ్య :- *చేతులు కాలాక ఆకులు పట్టుకుంటామంటారు.*

వార్త :- సాటిరారు రాష్ట్రానికెవ్వరూ... - మోడీపై కిరణ్ ధ్వజం.
వ్యాఖ్య :- *అవును... గందరగోళంలో మన రాష్ట్రానికి సాటిలేదు.*

వార్త :- ఢిల్లీకి ఇప్పుడే జ్ఞానోదయమైంది. - కేంద్రమంత్రి పల్లంరాజు.
వ్యాఖ్య :- *వాళ్లకు జ్ఞానోదయమయ్యేసరికి ఇక్కడి రాష్ట్రం తగలబడిపోయెనే...!*

వార్త :- ప్రధాని తక్షణమే స్పందించాలి. - కోడెల.
వ్యాఖ్య :- *ప్రధానిని తక్షణమే స్పందించేలా చేయండని సోనియాని కోరండి, ఫలితముంటుంది.*

వార్త :- తెలుగుదేశాన్ని భూస్థాపితం చేయాలని కాంగ్రెస్ కుట్ర. - నందమూరి హరికృష్ణ.
వ్యాఖ్య :- *అందుకు మీ బావ వున్నాడుగా.. వాళ్లెందుక చేతులు కాల్చుకుంటారు.*

వార్త :- రాజకీయపార్టీలు వ్యాపార సంస్థలు కావు. - సీపీఐ నారాయణ.
వ్యాఖ్య :- *మరి వసూలు కేంద్రాలా?*

వార్త :- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు. - ఎన్జీఓల సమ్మెపై ముఖ్యమంత్రి.
వ్యాఖ్య :- *అలాగే పరిపాలన కోసం ప్రత్యామ్నాయ ముఖ్యమంత్రిని కూడా ఏర్పాటు చేసుకుంటే సరి!*

PDF Compressor Free Version



# కోరలు చాస్తున్న డెంగీ

మళ్ళీ డెంగీ భూతం జడలువిప్పింది. నెల్లూరు జిల్లాలో కోరలు చాచి ప్రజల ప్రాణాలను హరిస్తోంది. ఆత్మకూరు పట్టణంలోని ఏకలవ్యనగర్‌కు చెందిన సిరి మోజెస్(3) డెంగీతో మరణించాడు. ఈనెల 7 నుంచి జ్వరంతో బాధపడిన మోజెస్‌కు ఆత్మకూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. కాని రక్తకణాలు తగ్గిపోతుండడంతో వైద్యుల సలహా మేరకు చెన్నైకు తరలించారు. అక్కడ మూడురోజులు చికిత్స జరిగినా సిరిమోజెస్ ప్రాణాలు దక్కలేదు. అలాగే ఏకలవ్యనగర్ ప్రాంతానికే చెందిన హరిత(3)కు వారం రోజుల నుంచి జ్వరం తగ్గకపోవడం రక్తకణాలు గణనీయంగా తగ్గిపోతుండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తీసుకువెళ్లారు. అప్పుడుగాని పురపాలక సిబ్బందికి ఆరోగ్యశాఖ అధికారులకు స్పందన కలగలేదు. అంతకు ముందు పలుమార్లు స్థానికులు వారి దృష్టికి తీసుకువెళ్ళినా ఏ చర్యలు తీసుకోలేదు. దాంతో దోమలు ఎక్కువై ఒక పాపప్రాణాలు పోయేలా చేసాయి. అప్పుడు పురపాలక ఆరోగ్యశాఖ సిబ్బంది ఏకలవ్యనగర్‌కు వచ్చి పారిశుధ్యం పనులు చేసేందుకు ప్రయత్నిస్తే స్థానికులు ఆగ్రహం ప్రకటించారు. కమీషనర్ భాగ్యలక్ష్మి స్వయంగా వచ్చి సముదాయించగా వారు అడ్డు తొలిగారు. ఆరోగ్య సిబ్బంది కూడా తగిన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు.

ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన షేక్ హాజీర డెంగీ జ్వరంతో బాధపడుతూ ఈనెల 12న మరణించింది. ఈమె సిఏ రెండో సంవత్సరం చదువుతోంది. జ్వరంతో వారం రోజులుగా బాధపడుతూ చికిత్స చేయించుకోగా డెంగీ జ్వరమని తేలడంతో మెరుగైన చికిత్సకోసం చెన్నైకి వెళ్ళినా ఆమె ప్రాణాలు దక్కలేదు. కాబట్టి సంబంధిత శాఖల సిబ్బంది, ప్రజలు ఇప్పటికైనా మేలుకొని తగు చర్యలు తీసుకుని ఆ మహమ్మారి డెంగీ వ్యాప్తి చెందకుండా చూస్తే ఇంకా పలు ప్రాణాలు పోకుండా వుంటాయి. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొని ఏం లాభం?

# నినదించిన విద్యార్థి లోకం



నెల్లూరులోని చైతన్య కళాశాలల విద్యార్థులు, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మద్దతుతో ఈనెల 12న విఆర్ కళాశాల కూడలి నుంచి గాంధీబొమ్మ కనకమహల్, బోసుబొమ్మ మీదుగా ఆత్మకూరు బస్టాండు వరకు సమైక్యాంధ్రను కోరుతూ భారీర్యాలీ జరిపారు. దీనికి నెల్లూరు గ్రామీణ, నగర శాసనసభ్యులు ఆనంవివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మద్దతు ప్రకటించారు. విద్యార్థులు ఆత్మకూరు బస్టాండు దగ్గర గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి స్క్రీన్‌ప్లే కెసీఆర్‌ది అయితే దిశానిర్దేశం మావోయిస్టులు చేస్తున్నారని తెలిపారు. పార్టీలతో పనిలేకుండా అందరం కలిసి సమైక్యాంధ్ర కోసం పోరాడాలని సూచించారు. పార్లమెంటులో బిల్లు వచ్చేంత వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. నగర శాసనసభ్యులు ముంగమూరు మాట్లాడుతూ ప్రజా ప్రతినిదులందరూ రాజీనామాలుచేసి పార్లమెంటులో బిల్లు వీగిపోతే సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో విఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, ఎస్.ఎస్.యూబి జిల్లా అధ్యక్షులు ముజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఏడాదిలోగా విద్యుత్ ఉత్పత్తి

## ఏపీజెన్‌కో సీఈ సత్యనారాయణ

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం నేలటూరులో నిర్మితమవుతున్న ఏపీజెన్‌కో విద్యుత్ ప్రాజెక్టులో ఈ ఏడాది నవంబర్ నుంచి మొదటి దశలో(800మెగావాట్లు) విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని సంస్థ సీఈ సత్యనారాయణ పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో కీలకమైన బాయిలర్‌ను మంగళవారం తెల్లవారుజామున మండించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రాజెక్టు ప్రగతి ఊపందుకుంది. ఈ సందర్భంగా సీఈ సత్యనారాయణ మాట్లాడుతూ లైటప్ ప్రక్రియ విజయవంతం కావడంతో మొదటి దశ విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం అయిందన్నారు. రెండోదశ (800మెగావాట్లు) విద్యుత్ ఉత్పత్తి 2014 ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రాజెక్టులో ప్రధానమైన కూలింగ్ టవర్లు, సీవాటర్ ఇంటెక్‌ప్లాంటు నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈతో పాటు ప్రధాన భాగస్వామ్య సంస్థలైన టాటా, గామన్ ఇండియా, బిహెచ్ఈఎల్, ఆల్‌స్టోమ్, ఇండ్‌వెల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. బాయిలర్ లైటప్ విజయవంతంగా జరిగినందుకు జెన్‌కో సీఎండీ విజయానంద్ డైరెక్టర్ రాధాకృష్ణ తదితరులు ప్రాజెక్టు ఇంజనీర్లను అభినందించారు.

# జన జీవనం బంద్

- ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు మూసివేత
- బస్టాండులోనే స్టాపింగ్ అయిన ఆర్టీసీ బస్సులు
- రోడ్లపై బారులుతీరిన ఉద్యోగులు, విద్యార్థులు
- స్వచ్ఛంధంగా తరలివచ్చిన ప్రజానీకం

రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ నెల్లూరు వాసులు ఉద్యమాన్ని ఉధృతంగా కొనసాగిస్తున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో 14రోజులుగా పాల్గొంటున్న స్ఫూర్తితోనే ఎన్జీఓ, విద్యార్థి, ఉద్యోగ జేఏసీల పిలుపుమేరకు మంగళవారం నుండి బంద్ పాటించారు. బంద్ ప్రశాం




తంగా సంపూర్ణంగా సక్సెస్ అయింది. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు స్వచ్ఛంధంగా మూసివేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులతో పాటు అన్నివర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి సమైక్యాంధ్ర కోరుతూ రాస్తారోకోలు, ర్యాలీలు, ప్రదర్శనలతో పాటు దిష్టిబొమ్మల దహనం, వంటావార్పు తదితర నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగడంతో ఎక్కడి బస్సులు అక్కడ ఆగిపోయాయి. రాష్ట్ర విభజన ప్రకటనను ఉపసంహరించేంత వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని జేఏసీ, ఎన్జీఓ, విద్యార్థి సంఘాలు రాజకీయ నేతలు హెచ్చరించారు. నెల్లూరు నగరంలో మంగళవారం ఉదయాన్నే బంద్ ప్రారంభమైంది. ఎన్జీఓలు, జేఏసీ చేపట్టిన ఆందోళనలకు అన్ని రాజకీయపార్టీలు మద్దతు తెలిపాయి. సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో బస్టాండు, వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్లలో రోడ్లపైన అల్పాహారం తిని, తలకిందులుగా నడిచి నిరసన వ్యక్తంచేశారు. పలువాహనాలను అడ్డుకున్నారు. దుకాణాలను మూసి వేయించారు. సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ అధ్వర్యంలో మినిబైపాస్ రోడ్డు వద్దనున్న పూలే దంపతుల విగ్రహాల వద్దే మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తంచేశారు. ఏపీఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిబ్బందికి హాజరు పుస్తకంలో సంతకం చేయించకుండా విధులు బహిష్కరింపజేశారు.

మనుబోలులో జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించారు. పొదలకూరులో సమైక్యాంధ్రవాదులు బంద్ పాటించారు. రోడ్లపై బైఠాయించి రాష్ట్ర విభజనకు నిరసనగా నినాదాలు చేశారు.



గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో టీడీపి వైయస్సార్‌సిపిలతో పాటు పట్టణంలోని పాన్‌బ్రోకర్స్, నగల దుకాణాలు, మర్చంట్స్ అసోసియేషన్, గ్యాస్‌సిబ్బంది, స్వర్ణకారులు బంద్‌లో పాల్గొన్నారు.

కావలిలో బంద్ ప్రశాంతంగా, సంపూర్ణంగా జరిగింది. ఆర్టీసీ బస్సులు కదలకపోవడంతో బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. ఎంపిడిఓ, మునిసిపల్, ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాలకు ఉద్యోగులు హాజరుకాలేదు. పట్టణంలో ర్యాలీలు నిర్వహించారు.

కోవూరులోవిద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. బుచ్చి, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది.

ఉదయగిరిలో ఎన్జీఓ, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో బస్టాండు సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వింజమూరులో విద్యార్థి జేఏసీ, ఎన్జీఓల ఆధ్వ






ర్యంలో పట్టణంలోని పాతబస్టాండు నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి దుకాణాలు మూసి వేయించి బంద్ నిర్వహించారు. వెంకటగిరిలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో కాశీపేట నుంచి అడ్డ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. సూళ్ళూరుపేటలో జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ అధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా జరిగింది బుధ, గురువారాల్లో సైతం ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధులకు హాజరు కాకుండా సమ్మెలో పాల్గొన్నారు.

# సంచిలో సొమ్ము మాయం

## 2.90లక్షలు అపహరణ

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వద్దనున్న సంచిని కత్తిరించి అందులో ఉన్న 2.90లక్షలు అపహరించిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటకు చెందిన రఘురామయ్య కొడుకు కిరణ్‌కుమార్‌కు ఈనెల 23వతేదీన వివాహం జరగనుంది. రఘురామయ్య కూతురు భర్త సుబ్రహ్మణ్యం నెల్లూరులో బంగారం పనిచేస్తుంటాడు. బావమరిది పెళ్ళికోసం నగలు చేయించేందుకు సుబ్రహ్మణ్యం సోమవారం ఇందుకూరుపేట వెళ్ళారు. మామ రఘురామయ్య వద్ద నగలు తయారీకిగాను 2.90లక్షలు తీసుకుని సంచిలో భద్రంచేసుకుని బస్సులో నెల్లూరు బయలుదేరారు. బస్సు ఆర్టీసీ మెయిన్ బస్టాండుకు చేరుకుంది. బస్సు దిగిన అనంతరం సంచిని పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు చాకచక్యంగా సంచి చివర కత్తిరించి అందులోని సొమ్మును అపహరించారు. దీంతో బస్సులో వెతికినా ప్రయోజనంలేకపోయింది. ఈ మేరకు నాల్గవ నగర పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసారు. సిఐ రామారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఏసి స్టేడియం వాకర్స్ "పక్షవాతం"పై అవగాహన సదస్సు





నెల్లూరు దర్గామిట్టలోని ఏసిసుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 14న వాకర్స్ అసోసియేషన్ పక్షవాతంపై అవగాహన సదస్సు నిర్వహించింది. ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డా॥ఎ.యుగంధర్‌రెడ్డి పక్షవాతంలో రకాలు పెద్దమెదడు పక్షవాతానికి గురైతే వచ్చే శారీరకలక్షణాలు, చిన్నమెదడు పక్షవాతానికి గురైతే వచ్చే శారీరక లక్షణాల గురించి వివరించారు. పక్షవాతం వచ్చిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసారు. వాకర్సు వెలిబుచ్చిన సందేహాలకు జవాబిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాఘవేంద్రషెట్టి, కార్యదర్శి ఎన్.బలరామయ్యనాయుడు, కోశాధికారి ఎస్.రమేష్ కార్యవర్గసభ్యులు పి.రవిచంద్ర, జి.ఓబులురెడ్డి, కె.అంకిరెడ్డి, బి.శేషగిరిరావు, వి.రంగారావు, ఎస్.నరసింహారావు, టి.శ్రీనివాసరావు, బి.సుందరరామిరెడ్డి, వి.హజరత్‌బాబు, సిహెచ్ దొరస్వామినాయుడు,పి.నాగేశ్వరరావు, కె.జయదేవ్, ఎ.చంద్రమౌళి పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# నెల్లూరు కబుర్లు

## ఆందోళనల దెబ్బకు ముఖంచాటేసిన నేతలు



ఈ నెల 11వ తేదీన నెల్లూరులో రెండు వీఐపీల వివాహాలు జరిగాయి. ఒకటి మాజీమేయర్ భానుశ్రీ కుమార్తెది కాగా రెండోది నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ కూతురిది. ఈ రెండు వివాహాలకు కూడా రాష్ట్రంలో పలువురు మంత్రులు రావాల్సి వుండింది. ముఖ్యంగా నారాయణ వాళ్ల పెళ్లికి తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు రావాల్సి వుండింది. ఈమేరకు నెల క్రితమే ఆయన ప్రోగ్రాం కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే నెల్లూరులో చోటుచేసుకున్న సమైక్యాంధ్ర ఆందోళనల నేపథ్యంలో చంద్రబాబుతో పాటు మిగతా ప్రజాప్రతినిధులు కూడా పెళ్లిళ్ళకు ఎగ్గొట్టారు.

## పెట్రోల్‌బంకుల వద్ద కిటకిట



సోమవారం రాత్రి నెల్లూరునగరంలో ఏ పెట్రోల్‌బంకు వద్ద చూసినా వాహనాలు క్యూకట్టాయి. బైక్‌లు, ఆటోలు, కార్లు బారులుతీరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. 12వ తేదీ అర్ధ రాత్రి నుండి సమ్మెకు పిలుపునిచ్చి వుండడంతో తమ వాహ నాల్లో పెట్రోల్, డీజిల్ అయిపోతే ఎక్కడ ఇబ్బంది పడాల్సి వస్తుందోనని వాహన దారులు పెట్రోల్ పట్టించుకోవడానికి కుస్తీ పడ్డారు.



ఈ నెల 13వ తేదీన 22, 23 డివిజన్లలో సిసిరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు

## 17న మహ్మద్‌రఫీ మ్యూజికల్‌నైట్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి

జాతీయఖ్యాతినార్జించిన దివంగత మధుర గాయకులు పద్మశ్రీ మహ్మద్‌రఫీని స్మరించుకొంటూ ప్రతిఏటా నెల్లూరులో క్రమంతప్పకుండా రఫీకల్చరల్ అకాడమీ నిర్వహిస్తున్న మ్యూజికల్ నైట్ ఈనెల 17న జరుగనున్నది. ఆదివారం రాత్రి అనిల్‌గార్డెన్స్‌లో ఈ కార్యక్రమ బ్రోచర్‌ను నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి విడుదలచేసి మాట్లాడుతూ మహ్మద్‌రఫీ గాత్రంలో వెలువడిన పాటల మ్యూజికల్‌నైట్‌ను ఇరవైఏళ్ళుగా నిర్వహిస్తూ శ్రోతలను తన్మయులను చేస్తున్న నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్‌ను అభినందించారు.

కార్యక్రమంలో ఖాజావలి, పి.శ్రీరాములు, సుహానా, మనపాటి రవీంద్ర, ఆసిమ్ పాషా, కరీముల్లా పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయానికి తాళం

సమైక్యాంధ్ర సమ్మెలో భాగంగా సోమవారం నెల్లూరుజిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ కార్యాలయానికి తాళంవేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి కాయల సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ జేసి, ఏజేసి, డిఆర్‌ఓలను మాత్రమే కలెక్టరేట్‌లో అనుమతిస్తామన్నారు.

## మండిన కూరగాయలు

కూరగాయలు సోమవారం పెద్దఎత్తున మండాయి. సమైక్యాంధ్ర ఆందోళనలలో భాగంగా ఏ.సి కూరగాయల మార్కెట్ వ్యాపారులు బంద్ ప్రకటించడంతో విని యోగదారులతో సోమవారం మార్కెట్ కిటకిటలాడింది. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు కూరగాయల ధరలను అమాంతం పెంచారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో కిలో 80రూపాయలు వున్న పచ్చిమిర్చి ధర 12గంటల కల్లా 120రూపాయలకు చేరింది. వ్యాపారులు కిలో ధర చెబుతున్నారో 10కిలోల ధర చెబుతున్నారో తెలియక వినియోగదారులు అయోమయంలో పడ్డారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి 2.50లక్షల విరాళం

నెల్లూరు నగరం పొదలకూరురోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దేవిరెడ్డి గంగాధర్‌రెడ్డి 2.50 లక్షలు విరాళంగా 10వతేదీ ఆసుపత్రి ఆవరణంలో అందజేసారు. ఆసుపత్రి ఆవరణంలో ప్రత్యేకంగా నిర్మిస్తున్న సర్జికల్ వార్డులో తమ తల్లిదండ్రులైన దేవిరెడ్డి శేఖర్‌రెడ్డి, అమ్మణమ్మల జ్ఞాపకార్థం ఒక గదిని నిర్మించేందుకు విరాళం అందించినట్లు తెలిపారు.

## నెల్లూరులో 'లక్ష్మీ'



నెల్లూరులో లక్ష్మీనారాయణ దంపతులను సత్కరిస్తున్న శ్రీశైలం దేవస్థానం మాజీచైర్మెన్ యిమ్మడిశెట్టి కోటేశ్వరరావు, యిమ్మడిశెట్టి పూలసత్యనారాయణ దంపతులు.

అక్రమాస్తుల కేసులో వై.యస్.జగన్మోహన్‌రెడ్డితో పాటు గనుల కేసులో గాలి జనార్ధన్‌రెడ్డి, ఇంకా పలు అవినీతి కేసుల్లో మంత్రులను, పారిశ్రామికవేత్తలను జైలుపాల్జేసిన సిబిఐ గత జాయింట్‌డైరెక్టర్ లక్ష్మీనారాయణ 11వ తేదీన నెల్లూరొచ్చారు. నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ కుమార్తె వివాహవేడుకకు ఆయన సతీసమేతంగా హాజరయ్యారు. అనంతరం కృష్ణపట్నంపోర్టును సందర్శించారు. మధ్యాహ్నం హోటల్ అతిథిగ్రాండ్‌లో శ్రీశైలం దేవస్థానం మాజీచైర్మెన్ యిమ్మడిశెట్టి కోటేశ్వరరావు ఆయన గౌరవార్థం ఏర్పాటుచేసిన విందుకు హాజరయ్యారు. ఆ తర్వాత పెంచలకోనకు వెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. అక్కడే విజయేశ్వరీదేవి ఆశ్రమాన్ని సందర్శించారు.

## రాష్ట్రాన్ని విభజించేందుకు సోనియా ఎవరు?

రాష్ట్రాన్ని విభజించేందుకు అసలు సోనియా ఎవరని తెలుగు జిల్లా ఫిలిం డిస్ట్రిబ్యూటర్ సంఘం ప్రశ్నించింది. 10వ తేదీ నెల్లూరులో విలేకర్లతో సంఘం అధ్యక్షులు పి.నాగిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రాన్ని విభజన చేసేందుకు నిర్ణయం తీసుకున్న సోనియా, షిండే, చిదంబరం, ఆంటోని, దిగ్విజయ్‌సింగ్ అహ్మద్‌పటేల్ ఎవరని, వారు మన రాష్ట్రంలోని జిల్లాల పేర్లు చెప్పగలరా అని ప్రశ్నించా... ఢిల్లీ ప్రజలనే రక్షించలేని కేంద్రం రాష్ట్రాన్ని విభజిస్తే హైదరాబాద్‌లో మన ఆంధ్రులను ఎంత వరకు రక్షిస్తారో చెప్పాలని డిమాండ్ చేసారు. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచే వరకు నిరసన కొనసాగిస్తా మన్నారు. మహిళలు పోస్టుకార్డుపై సమైక్యాంధ్ర నిర్ణయాన్ని తెలియజేస్తూ సోనియాకు పంపాలని కోరారు.

ఈ సమావేశంలో సంఘం సభ్యులు అయితా కొండలరావు, భాస్కర్‌రెడ్డి, లీలారెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, ఎ.వెంకటేష్, సాయికృష్ణ, శ్రీనివాసులు, మురళి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## కోడిగుడ్డుపై సమైక్యాంధ్ర నినాదం

నెల్లూరుకు చెందిన మైక్రో చిత్రకారుడు షేక్ అమీర్‌జాన్ సమైక్యాంధ్రకు మద్దతుగా రాష్ట్ర విభజన జరిగితే సమస్యలే అంటూ కోడిగుడ్డుపై వేసిన మైక్రో పెయింటింగ్ కళాఖండం అందరినీ అబ్బురపరుస్తోంది. పగిలిన కోడిగుడ్డుపై తెలంగాణా విభజన చిత్రాన్ని చిత్రించి రెండురాష్ట్రాల మధ్య తలెత్తే కరెంటు, నీరు, పరిశ్రమలు, చదువులు, ఉద్యోగ సమస్యలు ఇద్దరి మనోభావాలు దెబ్బతీసే ప్రమాదం ఉందని ఈ చిత్రీకరణలో తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ కళాత్మక పురాతన కట్టడాలు, చార్మినార్, కాకతీయ శిలాతోరణం, హైటెకిసిటీలను గుర్తుచేస్తూ పెయింటింగ్ చేసారు. రాష్ట్రం ముక్కలైతే ఈ సమస్యలకు పరిష్కారం ఏమిటి అనేందుకు కన్నీళ్ళు పెట్టుకున్న కంటితో ప్రశ్నార్థక చిహ్నాన్ని చిత్రించారు. తెలంగాణా వద్దు, సమైక్యాంధ్ర ముద్దు నినాదంతో ఈ చిత్రాన్ని అమీర్‌జాన్ ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

## పదవీకాంక్షతో...

# ప్రజలను విస్మరిస్తే పుట్టగతులుండవ్

**- ఆనం జయకుమార్‌రెడ్డి**



తుచ్ఛమైన పదవీకాంక్షతో ప్రజలను విస్మరిస్తే పుట్టగతులుండవని, కొంతమంది స్వార్థపరులు పన్నిన పన్నాగంతో ఆంధ్ర ప్రదేశ్ రెండు ముక్కలవుతుంటే అడ్డుకోలేక అధికార, ప్రతిపక్ష పార్టీలు చతికిలపడ్డాయని ఆనం జయకుమార్‌రెడ్డి విరుచుకు పడ్డారు. సోమవారం నెల్లూరు సుజాతమ్మకాలనీలోని ఆయన నివాసం నుంచి అభిమానులు, కార్యకర్తలతో రామలింగాపురం సెంటర్‌లో వున్న ఆనం వెంకటరెడ్డి విగ్రహం వద్దకు చేరుకుని విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్యాంధ్రకు మద్దతుగా రాజీనామాలు సమర్పించడంతో ప్రయోజనం ఉండదని రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజల మనోభావాలు గౌరవిస్తూ రాజీనామా చేయకుండా, మంత్రి పదవిని కాపాడుకోవడం కోసం ఇటువంటి ప్రకటనలు చేయడాన్ని ఖండిస్తున్నానన్నారు. రూ.4లక్షల కోట్లు ఇస్తే కొత్త రాజధానిని నిర్మించుకోవచ్చని చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు తెలుగుప్రజల ఆత్మాభిమానం, గౌరవం గంగలో కలిసిపోయేలా చేశాయన్నారు. పాలకపక్షం విఫలమైనప్పుడు ప్రజలకు అన్ని విధాలా అండగా నిలవాల్సిన ప్రతిపక్షం కేంద్రం ప్రకటించిన ప్యాకేజీలకు అమ్ముడుపోయిందని విమర్శించారు. మెగాస్టార్‌గా, పార్టీ అధినేతగా, కేంద్రమంత్రిగా ఆశీర్వదించిన ప్రజలను చిరంజీవి విస్మరించి పదవి కోసం పాకులాడుతున్నాడని ధ్వజమెత్తారు. కేంద్రం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని సీమాంధ్రలోని ప్రతిపౌరుడు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసులు, ఏసునాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, ఆసిఫ్‌బాషా, కుమార్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నజీర్, రియాజ్, గార్లపాటి విజయకుమార్, కొర్లగుంట బాబు, గూడూరు శ్రీధర్‌రెడ్డి, హేమచంద్రారెడ్డి, ఊటుకూరు ఆదిశేషయ్య, మాసా శ్రీనివాసులు, ఎస్.కె.బాబు, రాహుల్, రఘురామయ్యలు పాల్గొన్నారు.

PDF Compressor Free Version





ఈ నెల 10వ తేదీన నెల్లూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో మత్స్యకారులతో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఎస్పీ రామకృష్ణ.

## బందులతో... చదువులు చిందరవందర

సింహపురి సమాచారం



సమైక్యాంధ్ర ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులు

బంద్‌లు, బంద్‌లు, బంద్‌లు... విద్యార్థుల భవిష్యత్తును చిందరవందర చేస్తున్న నానారకాల బందులు. నిన్నటి దాక ప్రైవేటు పాఠశాలల ఫీజుల దందాను వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు చేసిన బందులతో విద్యాసంవత్సరం ప్రారంభమే గాబరా గాబరాగా నడిచింది. బడిబాట కాస్త బందుబాటగా తయారైంది.

ఇప్పుడేమో ఆ ఇటలీ తల్లి పుణ్యమా అని రాష్ట్రం రచ్చ రచ్చగా మారడంతో బడులు ఎప్పుడు తెరుచుకుంటాయో, ఎప్పుడు మూతపడతాయో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. దీంతో పిల్లల చదువులు చట్టుబండలవుతున్నాయని తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. ఈ కాంగ్రెస్ పార్టీ మేథావుల రాజకీయ క్రీడకు ఈ ఏడు విద్యార్థుల చదువు ఎత్తుకోవడమే మొత్తుకోడుగా మారిపోయింది. ప్రాథమికవిద్య నుంచి ఉన్నతవిద్య వరకు పాఠశాలలు, కళాశాలల్లో విద్య త్రిశంకు స్వర్గంలో వున్నట్టుంది. ప్రైవేటు పాఠశాలలు సమైక్యాంధ్ర బంద్‌ను సమర్థిస్తూ సెలవులు ప్రకటించగా ప్రభుత్వ పాఠశాలలు మాత్రం అధికారికంగా ప్రకటించకపోయినా బందు చేసే ఉద్యమకారులు వచ్చి మూయిస్తుండడం వల్ల అరకొరగా సాగుతున్నాయి. దీంతో తల్లిదండ్రులే పిల్లలను బడులకు పంపడంలేదు. ఇక ఉన్నత విద్య విషయానికొస్తే కళాశాలల విద్యార్థులే ఈ సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తుండడంతో పాటు విశ్వవిద్యాలయాలు, కళాశాలల అధ్యాపక సిబ్బంది స్వచ్ఛంధంగా బంద్‌కు మద్దతు ప్రకటిస్తుండడం గమనార్హం. దీనిని ఎవ్వరూ ఖండించలేని, సమర్థించలేని పరిస్థితిగా మారింది. రాష్ట్రం రెండుగా చీలిపోతుందనే భావనే సీమాంధ్రలోని ప్రతి ఒక్కరినీ కలచివేస్తుంది. అలా కాకూడదన్న సంకల్పంతోనే ఈ సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతోంది. మనం రాజకీయ చదరంగంలో పావులం, బలిపశువులమయ్యాం. ఏంచేద్దాం మన పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టక తప్పేటట్టులేదు.

## రాష్ట్ర విభజన నిర్ణయం మూర్ఖత్వం

- లక్ష్మీపార్వతి



విలేకర్లతో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

కేసీఆర్‌కు పదవిరాలేదని పలు ఉద్యమాలు నడిపితే అతని మాటలు విని రాష్ట్రాన్ని విభజించే నిర్ణయం తీసుకోవడం మూర్ఖత్వమని ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీ అధినేత్రి లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరుజిల్లా కావలి పట్టణంలో రైతు సంఘాల ద్వారా సమైక్యాంధ్రకు మద్దతుగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాతవూరులోని సదాశివరెడ్డి గృహంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తెలుగువారంతా ఒక రాష్ట్రంగా ఉండాలని పొట్టిశ్రీరాములు 56రోజులు ఉద్యమం చేసి తన ప్రాణాలను పణంగాపెట్టి సాధించిన రాష్ట్రాన్ని ఓట్లు, సీట్లు కోసం విభజించి తెలుగుతల్లి గుండెల్లో గునపం గుచ్చారన్నారు. ఎన్టీఆర్ తెలుగు జాతినంతా ఒకతాటి పైకి తెచ్చి ప్రపంచంలోనే కీర్తిప్రఖ్యాతలు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు చింపిన విస్తరిలా చేయడంలో చిదంబరం హస్తం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, రామిరెడ్డి కృష్ణారెడ్డి, సదాశివరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర మంత్రులు రాజీనామాలు చేయకుంటే చరిత్రహీనులే!



నగరంలో ఎన్జీవోల ర్యాలీ

- సమైక్య రాష్ట్ర పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రదర్శన
- చిరంజీవిపై పోటీకి సిద్ధమన్న హిజ్రాలు



కేసీఆర్ శవయాత్రలో హిజ్రాలు

రాష్ట్ర విభజనతో సీమాంధ్రులకు తీరని అన్యాయం జరిగి ఆందోళనలకు దిగుతుంటే కేంద్ర, రాష్ట్ర మంత్రులు రాజీనామాలు చేయకపోవడం దురదృష్టకరమని సమైక్య రాష్ట్ర పరిరక్షణ వేదిక చైర్మెన్ సి.రవీంద్రబాబు ధ్వజమెత్తారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్, పలు ఉద్యోగ సంఘాలు, సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీలు సంయుక్తంగా సమైక్యరాష్ట్ర పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఏబీఎం స్కూల్ నుంచి బయలుదేరి సుబేదారుపేట, గాంధీబొమ్మ, వీఆర్‌సి సెంటర్ మీదుగా మద్రాసుబస్టాండు సమీపంలో ఉన్న నెహ్రూ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా అన్ని సెంటర్లలో హిజ్రాలు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కన్వీనర్ అద్దంకి జగన్ మాట్లాడుతూ సీమాంధ్రలోని కేంద్ర రాష్ట్ర మంత్రులు పదవులను పట్టుకుని గబ్బిలాల లాగా వేలాడుతున్నారన్నారు. సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసి రాష్ట్ర కన్వీనర్ డీవి కృష్ణయాదవ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సకల జనుల సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధంగా వున్నారన్నారు. హిజ్రాల సంఘం నాయకురాలు అలేఖ్య మాట్లాడుతూ సమైక్య రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలకు సైతం హిజ్రాలు సిద్ధంగా వున్నారన్నారు. ప్రజారాజ్యం పార్టీని ఢిల్లీ పెద్దలకు తాకట్టుపెట్టి మంత్రి పదవే పరమావధిగా కొనసాగుతున్న చిరంజీవికి హిజ్రాలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా వున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో చిరంజీవి ఎక్కడ పోటీ చేసినా తమ అభ్యర్థిని పోటీకి నిలబెడతామన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు జి.వి.ప్రసాద్, జి.కిషోర్, ఎన్జీఓ సంఘం నాయకులు సి.అశోక్‌కుమార్‌రెడ్డి, సిహెచ్ సుధాకరరావు, సిహెచ్‌ఎస్‌ఎస్ శేఖరరావు, హిజ్రాలు పాల్గొన్నారు.

## అందర్నీ సంతోషపెట్టిన ఆర్టీసీ

ఆర్టీసీ సమయోచితంగా స్పందించి ప్రయాణీకుల రద్దీని గుర్తించి నెల్లూరు రీజియన్ పరిధిలో ఆదివారం నాడు అదనపు బస్సులు వేయడం అందరికీ సంతోషం కలిగించింది. ప్రయాణీకుల సంఖ్య మిక్కిలిగా పెరగడంతో చెన్నైకు 6ఎక్స్‌ప్రెస్‌లు, హైదరాబాద్‌కు 2సూపర్‌లగ్జరీలు, 6డీలక్స్‌లు, బెంగుళూరుకు 10సూపర్‌లగ్జరీలు, 1గరుడ, 3డీలక్స్, విజయవాడకు 4ఎక్స్‌ప్రెస్‌లు, కడపకు 6ఎక్స్‌ప్రెస్ బస్సులు అదనంగా నడిపినట్లు డిప్యూటీ సీటీయం పి.చంద్రశేఖర్ తెలిపారు. ఇలా ప్రయాణీకులకు మెరుగైన సేవలందిస్తే ఎంతో బాగుంటుంది.

## అతడే... ఆమె



ఆమెగా మారిన గౌస్‌బాషా

అతనికి భార్య ఇద్దరు పిల్లలు వున్నారు. ఏడాది కిందట అదృశ్యమయ్యాడు. ఎక్కడికెళ్ళాడో తెలియదు. కుటుంబ సభ్యులు వెతకని చోటులేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాని లాభంలేదు. తీరా ఏడాది తర్వాత అతను ఆమెగా ప్రత్యక్షమయ్యాడు. ఈ సంఘటన నెల్లూరు నగరం కోటమిట్ట ప్రాంతంలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే చంద్రబాబునగర్‌కు చెందిన గౌస్‌బాషా కోటమిట్టకు చెందిన సల్మాకు అయిదేళ్ళ కిందట వివాహమైంది. వీరికి సమీరా, సమీద్ ఇద్దరు పిల్లలున్నారు. ఆటోడ్రైవర్‌గా, కూలీపనులు చేసుకునే గౌస్‌బాషా ఏడాదికింద కనిపించకుండా పోయాడు. అతను కనిపించకపోవడంతో భార్య సల్మా 1వనగర పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. చివరకు విజయవాడలో ఉన్నట్లు సమాచారం రావడంతో వెతుకులాడారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో బోడిగాడితోటలో ఉన్నాడని సమాచారం రావడంతో పోలీసులతో అక్కడికి వెళ్ళి గౌస్‌బాషాను తీసుకువచ్చారు. అయితే అతడు కాస్తా ఆమెగా వారికి కనిపించడంతో అందరూ అవాక్కయ్యారు. చిన్నప్పటి నుంచి హిజ్రా లక్షణాలు వున్నాయని ఆడవారిగా ఉండడానికి ఇష్ట... బొంబాయి వెళ్ళి హిజ్రాగా మారానని గౌస్‌బాషా చెబుతున్నాడు. తల్లిదండ్రులు బలవంతంగా పెళ్ళిచేసారని చెప్పారు. కాని భార్య సల్మా మాత్రం అతనితోనే కాపురంచేసి ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చానని, కేవలం డబ్బు కోసం ఇలా వ్యవహరించడం అన్యాయమని రోదిస్తోంది. గౌస్‌బాషా మాత్రం తనను వదిలేయాలని అంటున్నాడు. దీంతో ఏమిచేయాలో పోలీసులకు తోచక తలలు పట్టుకుంటున్నారు. 1వ నగర సిఐ శ్రీనివాసరావు విచారిస్తున్నారు.

## రాష్ట్రాన్ని ముక్కలు చేయనివ్వం

జంగమదేవర్ల వినూత్న నిరసన



రాష్ట్రాన్ని ముక్కలు చేస్తే సహించేది లేదని జంగమసేవాసంఘం అధ్యక్షుడు గంధవళ్ల దశరథరామయ్య హెచ్చరించారు. సమైక్యాంధ్రకు మద్దతుగా సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో సోమవారం వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన నిర్వహించి, కెసిఆర్ బొమ్మకు శవయాత్ర చేశారు. కెసిఆర్‌బొమ్మను పాడెపై ఉంచి సంప్రదాయపద్ధతిలో జంగమదేవర్లు చేతిలో శంఖాలను పెట్టుకుని, గంటలు మోగిస్తూ విఆర్‌సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. గాంధీ బొమ్మ వద్ద పాడెను దించి, శవానికి దహనసంస్కారాలు చేశారు. సమైక్యాంధ్ర వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పి.వీరభద్రరావు, జంగందేవర్లు సంఘ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.


## భవనము బాడుగకు కలదు

నెల్లూరు నగరం దర్గామిట్ట, సరస్వతీనగర్‌లోని జె.కె.రెడ్డి గారి ఇంటి ప్రక్కవీధిలో 6 అపార్ట్‌మెంట్లు కలిగిన భవనము అద్దెకు కలదు. బ్యాంకులు, కార్యాలయాలకు అనువైనది.

ఆసక్తికలవారు దిగువ నంబర్లనందు సంప్రదించగలరు.

☎: 0861 - 2323270, సెల్: 94402 78444

PDF Compressor Free Version



కదంబం

## నాన్నంటే

అనూరాధ రామకృష్ణ,
నెల్లూరు, 9394837563.



ఆరు ఋతువులు,
నవరసాలు -
నాన్నలో చూశాను!
నాకు నడవడిక
నేర్పకపోయినా
నాన్నను చూసి
నడత నేర్చుకున్నాను.
నాన్నమ్మ చెప్పిన
నాన్న చిన్ననాటి
జ్ఞాపకాలు
నా హృదయంలో
పదిలం!
నాన్న నాకు ఆదర్శం!
అందుకు -
నేనే నిదర్శనం.
నాన్న అడుగుజాడలు
చెదరిపోయినా,
నాది అదే రహదారి.
నాన్న మహోన్నతమైనవ్యక్తి
కాకపోయినా
మానవత్వమున్న
మామూలు మనిషి అయినా
నాన్న నాన్నే!

## హైదరాబాద్‌ను వద్దన్న తెలంగాణవాళ్ళు

గల్పిక

అది సీమాంధ్ర, తెలంగాణవాళ్లు మాదంటే మాదని కొట్టుకుంటున్న భాగ్యనగరం. గాంధీ భవన్‌లో సీమాంధ్ర, తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఢిల్లీ నుండి దిగ్విజయ్‌సింగ్ ఆంటోనీలు పెద్దమనుషులుగా వచ్చారు. వాళ్లిద్దరూ ఎదురుగా కూర్చోగా వారికి ఒకవైపు సీమాంధ్ర టీం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, శైలజానాథ్, రఘువీరారెడ్డి, పితాని సత్యనారాయణ, గంటా శ్రీనివాసరావు, విశ్వరూప్, గల్లా అరుణకుమారి, కన్నా లక్ష్మీనారాయణ, సైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(63) ఇంకా సీమాంధ్ర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా కూర్చుని వున్నారు. ఇంకోవైపు డిప్యూటీసీఎం దామోదర రాజనరసింహ, డి.శ్రీనివాస్, సబితా ఇంద్రారెడ్డి, డి.కె.అరుణ, దానం నాగేందర్, పొన్నాల లక్ష్మయ్య, జైపాల్‌రెడ్డి, సర్వే సత్యనారాయణ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంకా పలువురు కాంగ్రెస్ తెలంగాణ నేతలు కూర్చుని వున్నారు. ఇరు ప్రాంతాలకు మధ్య ఆరోజు రాజీపంచాయితీ ఏర్పాటు చేసారు. పెద్ద మనిషిగా దిగ్విజయ్‌సింగ్ మాట్లాడుతూ... సోనియాగాంధీ నన్ను పంపించారు... ఇరు ప్రాంతాల నేతలు కలహించుకోవడం ఆమె చూడలేకపోతున్నారు. సోనియా కుటుంబం బాగుంటేనే కాంగ్రెస్‌పార్టీ బాగుంటుంది... కాంగ్రెస్ బాగుంటేనే మీరంతా బాగుంటారు. దేశం ఏమైపోయినా ఫర్వాలేదు. మా నాయకులు బాగుంటే చాలు అని ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్. ఇలాంటి పార్టీని కాపాడుకోవడం మనందరి ధర్మం. ప్రధానమంత్రి అయితేనే గాని పెళ్లి చేసుకోనని రాహుల్ బాబు అంటున్నాడు. ఇప్పుడే ఆయనను ప్రధానిని చేయడానికి ప్రజలు ఒప్పుకోవడం లేదు... ఇంకో అయిదేళ్ల పోతే ఆయనకు పిల్లనివ్వడానికి కూడా ఎవ్వరూ ఒప్పుకోరు. కాబట్టి ఆయనను ప్రధానిని చేయాలంటే ఎంపీ సీట్లు ఎక్కువ కావాలి. ఏపీలో సీట్లు వచ్చే పరిస్థితి లేదు. అందుకే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తే అక్కడన్నా కొన్ని సీట్లు వస్తాయి. కాబట్టి సీమాంధ్రలో విభజనకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నాడు.

అప్పుడు రఘువీరారెడ్డి లేచి... విభజనకు మేం సహకరిస్తాం సరే... మరి హైదరాబాద్ సంగతేంటని అడిగాడు. హైదరాబాద్ తెలంగాణకే పోతుంది. కావాలంటే మీరు సీమాంధ్రలో కొంప, గోడు ఏర్పాటు చేసుకునే దాకా ఇక్కడే వుండొచ్చని దిగ్విజయ్ చెప్పాడు. వెంటనే సైల్ ఆఫ్ సింహపురి వివేకా ఒక ఆవును పట్టుకుని దిగ్విజయ్ వద్దకు వచ్చి... ఈ రెండు ప్రాంతాల వారికి ఈ ఆవును ఎలా పంచుతావో చెప్పు అని కోరాడు. అప్పుడు దిగ్విజయ్‌సింగ్... ఈ ఆవును మీ రాష్ట్రంలా అడ్డంగా నరకలేం... అలా చేస్తే అది చచ్చూరుకుంటుంది. కాబట్టి తలభాగాన్ని సీమాంధ్రవాళ్లు చూసుకుంటారు. పొదుగు, పేడ భాగాన్ని తెలంగాణవాళ్లు చూసుకుంటారని అన్నాడు. అప్పుడు వివేకా కోపంతో... మీ పెద్దరికం ఏడ్చినట్లే వుంది. ఆవును పంచినట్లుగానే మీరు హైదరాబాద్‌ను పంచుతున్నారు. ఇంతకాలం హైదరాబాద్‌ను అభివృద్ధిచేసింది మేమైతే, దాన్ని ఈరోజు తెలంగాణ వాళ్లకిచ్చి మమ్మల్ని గుడ్డలూడదీసి పంపుతారా అని ప్రశ్నించాడు. దానికి దిగ్విజయ్‌సింగ్... ఇప్పుడు మాకు ఎంపీ సీట్లే ముఖ్యం... మీరెటైనాపోండి... ఏ గంగలో అయినా దూకండి... హైదరాబాద్ వాళ్లదే... ఇక ఈ విషయంలో రెండో నిర్ణయం లేదన్నాడు. ఆ మాటకు వివేకాకు మండి... ఇదే మీ ఆఖరి నిర్ణయమైతే మా నిర్ణయమేంటో కూడా చెబుతాం వినండి... ఈ హైదరాబాద్ మాకొద్దుబాబు అని తెలంగాణవాళ్లచేతే అనిపిస్తాను... హైదరాబాద్ నుండి వాళ్లే కాదు, మీరు కూడా బ్రతుకుజీవుడా... అని పరుగులు తీసేలా చేస్తాను. వారంరోజుల్లోనే ఇది జరుగుతుంది. అది జరక్కపోతే నా పేరు వివేకానే కాదు... అని సవాల్ విసిరాడు. దిగ్విజయ్‌తో పాటు తెలంగాణ కాంగ్రెస్ నేతలు కూడా ఆ సవాల్‌కు సై అన్నారు.

వారంరోజుల తర్వాత...

హైదరాబాద్‌లో అంతుబట్టని జ్వరాలు... వింతవ్యాధులతో ఆసు పత్రులపాలవుతున్న ప్రజలు... హైదరాబాద్‌కు రావాలంటే భయపడుతున్న నాయకులు... టీవీ ఛానెల్స్ నిండా ఈ వార్తలే! విభజన విషయమై మాట్లాడ్డానికి హైదరాబాద్ రావాల్సిన ఆంటోనీ కమిటీ కూడా ఈ రోగాల దెబ్బకు భయపడి తమ పర్యటనను రద్దు చేసుకుంది. హైదరాబాద్ అంతా అల్లకల్లోలంగా మారింది. చివరకు తెలంగాణ నాయకులు మాకు ఈ హైదరాబాద్ వద్దు... మేం కొత్త రాజధానిని ఏర్పాటు చేసు కుంటాం అని ప్రకటించారు.

★★★★★

సీమాంధ్ర నాయకులంతా హైదరాబాద్‌కు పోవడానికి భయపడి నెల్లూరులోని ఏ.సి.సెంటర్‌లో సమావేశమయ్యారు. రఘువీరారెడ్డి వుండి... వివేకాతో... నువ్వు నీ సవాల్‌ను నిజం చేశావు... తెలంగాణవాళ్ల చేతే హైదరాబాద్ వద్దనిపించావు. అంతా ఆశ్చర్యంగా వుంది. ఇదెలా సాధ్యమైందని అడిగాడు. అప్పుడు వివేకా... ఇందులో నా గొప్పేమీ లేదన్నా... అంతా మా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల మహిమ. దిగ్విజయ్‌సింగ్‌తో సవాల్‌చేసి నెల్లూరుకు తిరిగొచ్చాక మా మాజీ మేయర్ భానుశ్రీ, మాజీకార్పొరేటర్లు, నగరపాలక సిబ్బంది సహకారంతో ఆ సందూ, ఈ సందూ తిరిగి 10టన్నుల దాకా మున్సిపల్ ముదురు దోమలను పట్టాము. వాటిని సంచులలో బిగించి కార్లలో హైదరాబాద్ తీసుకొచ్చి అక్కడక్కడా వదిలాను. నగరమంతా అవి విస్తరించాయి. అవి కరవడం వల్లే హైదరాబాద్ అంతటా విష జ్వరాలు అంటుకున్నాయి. ఇక అవి హైదరాబాద్‌ను వదిలిపోవు. అవి వున్నంతకాలం తెలంగాణ నాయకులు అక్కడికి పోలేరు. వాళ్లకు తిక్క కుదిరింది. మనకు దక్కనిది ఇంకొకరికి దక్కుతుంటే చూస్తూ వూరుకోవడానికి నేనేమన్నా వెర్రి వెంగలప్పనా...? అని అన్నాడు.

వాళ్లు సరే మనం పోగలమా... అని పితాని సత్యనారాయణ అడిగాడు... దానికి వివేకా, మీరెవరూ పోలేరు... నేనూ, నా తమ్ముడు రామనారాయణరెడ్డి మాత్రం పోగలం. ఆ దోమలు మాకు అలవాటేగా అని చెప్పాడు. ఆ మాటకు మిగతా సీమాంధ్రనేత లంతా జెరా... ఆనంబ్రదర్స్ అంటూ నోరెళ్లబెట్టారు.

## 18న అభినయ ఆర్ట్స్ వార్షికోత్సవం

నెల్లూరు పురమందిరంలో ఈనెల 18న అభినయ ఆర్ట్స్ ద్వితీయ వార్షికోత్సవం జరుగుతుందని అధ్యక్షులు సి.ఆర్.రాఘవ తెలిపారు. ఈ సందర్భంగా రాఘవ రచించిన "అవినీతి రహిత సమాజంకోసం" పుస్తకావిష్కరణ జరుగుతుందని గానగంధర్వ పి.కృష్ణయ్య సినీసంగీతం, గురుకృప విద్యార్థినులు, కుమారి కీర్తిప్రియల నృత్యవిభావరి, యం.వి.కృష్ణయ్య "రావణబ్రహ్మ" ఏకపాత్రాభినయం, అభినయ ఆర్ట్స్ "కిన్నెర" నాటిక, "కుంటి మేకపిల్ల" హాస్యనాటికల ప్రదర్శనలుంటాయని తెలిపారు. రసజ్ఞులు తమ సంస్థవార్షికోత్సవంలో పాల్గొని నాటకరంగానికి బాసటగా నిలవాలని కోరుతున్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో

## జర్నలిజం, లా కోర్సులు ప్రవేశపెట్టాలి

నెల్లూరు సర్వోదయ కళాశాలలో ఈనెల 11న డా॥బి.ఆర్. అంబేద్కర్ ఐఏఎస్ స్టడీసర్కిల్, ఏడివియన్ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్టడీసర్కిల్ ఛైర్మెన్ అరవ పూర్ణప్రకాష్ మాట్లాడుతూ యూనివర్శిటీలో బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు స్కాలర్ షిప్‌లు అందక నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఉన్నతమైన విద్యను అందించే ఈ యూనివర్శిటీలో ఇతర డిగ్రీ, పీజీలతో పాటు జర్నలిజం, లా కోర్సులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసారు. అలాగే అంబేద్కర్ స్టడీసర్కిల్ పనులను త్వరగా ప్రారంభించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జె.ప్రేమ్‌సన్, గార వెంకట్, ఇలాన్‌జ్యోతి. గోపి, ఎస్.కె.షఫీ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవాసమాఖ్య కార్యవర్గం

బ్రాహ్మణసేవాసంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షులుగా రాళ్ళపల్లి రామసుబ్బారావును ఎన్నుకున్నారు. అలాగే అధ్యక్షులుగా గుండ్లదొన వాసుదేవరావు కార్యదర్శిగా ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, కోశాధికారిగా వక్రాల వెంకటలక్ష్మీనరసింహంలను ఎన్నుకున్నారు. ఈ సంఘంలో చేరదలచుకున్నవారు 9848709424, 9848486599నెంబర్లలో సంప్రదించాలని కార్యదర్శి ఓ ప్రకటనలో తెలియజేశారు.

## వైభవంగా ధర్మరాజ పట్టాభిషేకం



నెల్లూరు నగరంలోని మూలాపేటలో వేంచేసియున్న శ్రీకృష్ణ ధర్మరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి యుధిష్టర పట్టాభిషేక మహోత్సవాన్ని కనులవిందుగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో పవిత్ర పుష్పాలతో విశేషంగా అలంకరించారు. దర్బార్‌లో శ్రీకృష్ణుడు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు,ద్రౌపది అమ్మవారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. వజ్రాభరణాలతో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పాండురాజ్యానికి ధర్మరాజు పట్టాభిషిక్తుడయ్యాడు. శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి, రామతీర్థం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్ పర్యవేక్షణలో ఈ కార్యక్ర మాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా దీపక్‌సింగ్, దొంతంశెట్టి నారాయణశెట్టి, వెంకట సుబ్బమ్మలు వ్యవహరించారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విఘ్నేశ్వర నృత్యనికేతన్ అధినేత్రి విజయలక్ష్మి శిష్యబృందం ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు అందరిని అలరించాయి.

## సూక్ష్మరూపంతో...

## స్వాతంత్ర్యదిన శుభాకాంక్షలు






నెల్లూరులో సూక్ష్మరూపాలను తయారుచేసి సంచలనం సృష్టిస్తున్న స్వర్ణకారుడు షేక్ ముసవ్వీర్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 500మి.గ్రా బంగారం, 600మి.గ్రా వెండిని ఉపయోగించి ఓ నమూనాతో దేశభక్తిని చాటుకున్నాడు. ఢిల్లీలోని ఎర్రకోటలో భారతదేశ ప్రస్తుత ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తుండగా విద్యార్థులు వందనం చేస్తున్నట్లు దీనిని అందంగా రూపొందించాడు. ఈ సందర్భంగా ముసవ్వీర్ మాట్లాడుతూ భారతదేశం సస్యశ్యామలంగా శాంతియుతంగా వుండాలని ఆకాంక్షిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నమూనాను తయారుచేయడానికి రెండురోజులు శ్రమించానని తెలిపారు. 3.5సెం.మీ ఎత్తు, 3సెం.మీ వెడల్పు కలిగిన ఈ స్వర్ణరజిత సూక్ష్మరూపం అందర్నీ ఆకర్షిస్తోంది.

PDF Compressor Free Version



## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులను, నష్టాలను అధిగమిస్తారు. ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు, స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. అధికారులకు పనివత్తిడి, ఉద్యోగులకు పనిభారం ఉంటుంది. సోదరవర్గానికి మేలు జరుగుతుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలపై హామీలు లభిస్తాయి. గృహవస్తువాహన రిపేర్లుంటాయి.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వృత్తి పరంగా బాగా పుంజుకుంటారు. ఆదాయం బాగుంటుంది. శుభకార్యాలలో ప్రాముఖ్యత వహించడం, దూరప్రయాణాలుంటాయి. కుటుంబసౌఖ్యము బాగుంటుంది. క్రయవిక్రయాలపై తొందరపాటు ప్రదర్శించవద్దు. సాంఘిక సేవారంగాలలో ప్రముఖ పాత్ర వహిస్తారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అధికారులతో సామరస్యంగా మెలుగుతారు.


## మిధునం



మృగశిర్ష 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక పరిస్థితి బాగుండి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. ఆదాయమునకు తగ్గ ఖర్చులుంటాయి. మీ ఆలోచనలు సలహాలు వల్ల ఇతరులకు మేలు జరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయస్థితికి వస్తాయి. శుభకార్యాలలో పాల్గొనడం, అనుకోని ప్రయాణాలుంటాయి. క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు, విలువైన వస్తువులు కొనడం జరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారాలలో ఆటంకాలు తొలగి ఆర్థికంగా బలపడతారు. ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనం కలవారికి శ్రమ ఉంటుంది. ఆశించిన ఆదాయముండదు. నిర్ణయాలు తొందరపడి తీసికొనకుండా ఆత్మీయులను సంప్రదించడం మంచిది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. బంధుమిత్రులతోను, అధికారవర్గంతోనూ పంతాలు పట్టింపులకు పోకుండా సర్దుకొనిపోవడం మంచిది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపారవృద్ధి కొరకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. విలువైన వస్తు వస్త్రాలు కొనుగోలు జరుపుతారు. హోల్ సేల్ డీలర్లు, ధాన్యం, ఎరువులు వ్యాపారులపై ప్రభుత్వ దాడులు ఇబ్బందులుంటాయి. దూర ప్రయాణాలు శుభకార్యాలలో పాల్గొనడం జరుగుంది. ఉద్యోగులకు పనిభారం, ప్రభుత్వం వల్ల సమస్యలుంటాయి.


## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కొత్త పెట్టుబడులు, కొత్త షేర్ల విషయంలో తొందర పడవద్దు. ఆర్థికావకాశాలు సన్నగిల్లి ఆశించిన ఆదాయం ఉండదు. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు, వీటివల్ల ఖర్చులు పెరుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలందు జాగ్రత్త అవసరం. యూనియన్ కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. బంధు వర్గంతో విభేదాలు ఏర్పడవచ్చును.

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 16.08.2013 నుండి
తేది. 22.08.2013 వరకు

ఈవారం మేషంలో కేతువు, వృషభంలో గురుకుజులు, 18తేది నుండి కర్కాటకంలో కుజుడు, కర్కాటకంలో రవిబుధులు, 17తేది నుండి సింహంలో రవి మరియు 20తేది నుండి సింహంలో బుధుడు, కన్యలో శుక్రుడు. తులలో శనిరాహువులు, వృశ్చికధనుర్మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 16 శుక్రవారం వరలక్ష్మీ వ్రతం
తేది 21 బుధవారము శ్రావణపూర్ణిమ. రాఖీపండుగ

### ముహూర్తములు

18.8.2013 ఆదివారము రాత్రి 8.30 నుండి 10.0లోగా వివాహము మీనలగ్నము. 21.8.2013 బుధవారము ఉదయం 8.0నుండి 10.0లోగా గృహారంభ వివాహ వ్యాపారములు కన్యాలగ్నం. బుధవారం రాత్రి గంట 1.20 నుండి 3.30లోగా గృహప్రవేశ వివాహములు మిధునలగ్నం. 22.8.2013 గురువారము ఉదయం 7.45 నుండి 9.45లోగా వివాహ వ్యాపార గృహారంభ, అక్షరాభ్యాసాలకు కన్యాలగ్నము.

### శ్రావణమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | దశమి | రా॥గం.7.34వ॥ |
| తేది. 17 | శని | ఏకాదశి | సా॥గం. 5.10వ॥ |
| తేది. 18 | ఆది | ద్వాదశి | మ॥గం. 2.40వ॥ |
| తేది. 19 | సోమ | త్రయోదశి | మ॥గం. 12.14వ॥ |
| తేది. 20 | మంగళ | చతుర్ధశి | ఉ॥గం. 9.56వ॥ |
| తేది. 21 | బుధ | పూర్ణిమ | ఉ॥గం.7.50వ॥ |
| | పిదప | పాడ్యమి | రా॥గం.5.58వ॥ |
| తేది. 22 | గురు | విదియ | రా॥గం.4.20వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి ఉద్యోగాలలో మార్పులు చోటుచేసుకొనవచ్చును. కొత్త ప్రణాళికలు పథకాలతో వ్యాపార వర్గాలు అభివృద్ధి చెందుతాయి. ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. కొత్త పెట్టుబడులపై పునరాలోచన అవసరం. స్త్రీలకు అనారోగ్య సమస్యలుంటాయి. వస్తువాహన గృహ రిపేర్లు అదనంగా ఉంటాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత తక్కువ.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబ వ్యవహారాలలో, ఆర్థిక వ్యవహారాలను కడు జాగ్రత్తలతో నిర్వహించవలసి ఉంటుంది. కుటుంబ సభ్యుల వ్యతిరేకత కొంత బాధిస్తుంది. బిడ్డ విద్యా ఉద్యోగ, వివాహ విషయాలలో శ్రద్ధ పెడతారు. అనుకున్న పనులకు ఆటంకాలు వస్తుంటాయి. వ్యాపార వృత్తి రంగాలవారికి అవకాశాలు మంచివి చేజారిపోవచ్చును. కాని సామాన్య ఆదాయానికి లోపం రాదు.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శాస్త్ర సాంకేతిక వృత్తి రంగాలవారు ప్రతిభను చూపుతారు మరియు గుర్తింపు పొందుతారు. నూతన వస్తు వాహనాలు సమకూర్చుకొనడం, కొత్త పెట్టుబడులకు అవకాశాలు, ఆహ్వానాలు అందుకొనడం జరుగుతుంది. వ్యాపారవర్గాల వారికి ఆర్థిక పరిస్థితి బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయ విక్రయాలలో తొందర పడవద్దు. షేర్లు లాభాలనందిస్తాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక విషయాలపై దృష్టిపెట్టి ఇబ్బందుల నుండి బయటపడే ప్రయత్నాలు చేస్తారు. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు తప్పిపోవచ్చును. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, రావలసిన బిల్లులు, ప్రమోషన్లు వాయిదా పడతాయి. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. మీ అభిప్రాయాలను సున్నితంగా తెలపడం మంచిది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులు సానుకూలం కాగలవు. ఇంట బయట వ్యవహారాలలో తొందరపాటు వద్దు. రవాణా, పరిశ్రమల రంగాలవారికి నిర్వహణా ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికస్థితి సామాన్యంగా ఉండి ఆదాయం కూడా సామాన్యంగా ఉంటుంది. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. శుభ కార్య ఖర్చులు ప్రయాణఖర్చులు పెరుగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఖర్చులు పెరిగినా భారమనిపించవు. వృత్తి వ్యాపార రంగాలవారికి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. యూనియన్ కార్యక్రమాలలో పాల్గొనడం, అధికారుల నుండి, పబ్లిక్ నుండి వత్తిడి పెరుగుతుంది. పెట్టుబడులకు ఆహ్వానాలు అందుకొనడం ప్రోత్సహించబడటం జరుగుతుంది.

# కుక్కలు చింపిన విస్తరిలా రాష్ట్రం

## కాంగ్రెస్‌దే ఈ పాపం - జూపూడి



విలేకర్లతో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్

కుక్కలు చింపిన విస్తరిలా రాష్ట్రాన్ని కాంగ్రెస్ మార్చిందని, విభజన నిర్ణయాన్ని ప్రకటించి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీకి ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెబుతారని ఎమ్మెల్సీ, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ రాత్రి నగరంలోని అంబేద్కర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ సీమాంధ్ర ప్రాంత ప్రజల ప్రయోజనాలకై స్వాగతిస్తున్నానన్నారు. ఇప్పుడు వైయస్ వల్లే ఇలా జరుగుతుందని, నిందలు వేయడం సరికాదన్నారు శాసనసభలో 84మంది సభ్యుల మెజారిటీ ఉన్న ప్రతిపక్షం సరైనపాత్రను పోషించడంలేదన్నారు. అధికార పక్షంతో ప్రతిపక్షం కుమ్మక్కై ప్యాకేజీలకోసం పాకులాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అరవ పార్వతమ్మ, గ్రంధం రమేష్, శంకరయ్య, మధుసూదన్‌రావు, దాసరి కృష్ణ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్ళ చిన్నారిపై అత్యాచారం

అభంశుభం తెలియని నాలుగేళ్ళ చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారంమేరకు నెల్లూరు బాలాజీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపదొరువు ప్రాంతంలో ఓ కుటుంబం కాపురం ఉంటున్నారు. వీరికి నాలుగేళ్ళ కూతురుంది. అదే ప్రాంతంలో కోట మండలం గూడలి గ్రామానికి చెందిన గుంటక పురుషోత్తం(21) క్యాటరింగ్ పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఫుల్లుగా మద్యం తాగిన పురుషోత్తం కన్ను ఆప్రాంతంలో ఆడుకుంటున్న నాలుగేళ్ళ బాలికపై పడింది. చాక్లెట్లు ఇస్తానని నమ్మించి చెట్లపొదల్లోకి తీసుకెళ్ళి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడి పైశాచిక అకృత్యానికి భయపడ్డ బాలిక ఏడుస్తూ జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో కామాంధుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు ఆ సమాచారం అందించారు. బాలాజీనగర్ సిఐ మంగారావు, ఎస్సై నాగేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకుని అత్యాచారం చేసిన యువకుడ్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి పాపను వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# 108 సిబ్బంది నిర్వాకం

పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి ప్రాథమిక వైద్యులు అందించి మెరుగైన వైద్యసేవలకై ప్రభుత్వాసుపత్రికి తరలించాల్సిన 108సిబ్బంది ఆ గర్భిణిని దారి మధ్యలో దింపేసి వెళ్ళిన సంఘటన 10వ తేదీ రాత్రి చోటుచేసుకుంది. బిల్లకూరు మండలం తిక్కవరం గ్రామానికి చెందిన జి.నవనీతమ్మ పురిటినొప్పులతో బాధపడుతుండగా స్థానికులు 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108సిబ్బంది అక్కడికి చేరుకుని గర్భిణిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించాల్సివుంది. కాని తమ విధులు సమయం దాటిపోయిందని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వదిలేశారు. తీవ్రరక్తస్రావం అవుతున్న ఆమెను స్థానిక వైద్యులు కలుగజేసుకుని నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు 108లో చేర్పించినట్లు సమాచారం. మార్గం మధ్యలో వదిలేసిన 108 సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.






# పెళ్లి సంబంధాలు

## వధువు కావలెను

1. 1982 జనవరి 5 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్. వృత్తి వ్యాపారం. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 10కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
2. 1979 ఏప్రిల్ 20 జననం. ఎత్తు 6". చదువు బి.టెక్. వృత్తి వ్యాపారం. ఆస్తివిలువ 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
3. 1988 జూలై 9 జననం. ఎత్తు 5'10". చదువు బి.టెక్, యం.బి.ఏ. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 7కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1984 డిసెంబరు 23 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ చెన్నై, జీతం నెలకు 70,000/-. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 3కోట్లు స్వస్థలం నెల్లూరుజిల్లా.
5. 1985 జూలై 24 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్(కంప్యూటర్స్), యం.బి.ఏ(హెచ్‌ఆర్). ఉద్యోగం సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అక్సెంచర్, హైదరాబాద్. జీతం నెలకు 60,000/-. ఉన్నతమైనరెడ్డి వ్యవసాయకుటుంబం. ఆస్తివిలువ 2కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.

## వరుడు కావలెను

6. 1988 జనవరి 9 జననం. ఎత్తు 5'21/2". చదువు బి.టెక్(ఐటి), యం.టెక్. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 3కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
7. 1985 జనవరి 4 జననం. ఎత్తు 5'3". చదువు యం.సి.ఏ(తెనాలి). ఉన్నతమైనరెడ్డి వ్యవసాయ మధ్య తరగతి కుటుంబం. స్వస్థలం ప్రకాశంజిల్లా. ఆస్తివాటా 20లక్షలు.
8. 1991 మే 20 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్(ఇఇఇ)చెన్నై. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 5కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం మద్రాసు.
9. 1992 జనవరి 17 జననం. ఎత్తు 5'31/2". చదువు బి.యస్.సి(బెంగుళూరు), యం.యస్(హ్యూమన్ రిసోర్సెస్) బెంగుళూరు. స్వస్థలం మద్రాసు ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 3కోట్లు.
10. 1981 ఆగష్టు 7 జననం. ఎత్తు 5'4". చదువు బి.యస్.సి(కంప్యూటర్స్), యం.బి.ఏ(హెచ్.ఆర్). ఉన్నతమైనరెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్తివాటా 11/2కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.

98480 34522
94406 39460.

ఫోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం...!



నెల్లూరునగర మాజీమేయర్ శ్రీమతి నందిమండలం భానుశ్రీ - వెంకట శివసుబ్బరాజుల కుమార్తె **శ్రీదివ్య - వినోద్‌కుమార్** (రెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులు నాగం లక్ష్మీనరసారెడ్డి - లలితమ్మల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 11వ తేదీ నెల్లూరులో కస్తూరిదేవి గార్డెన్స్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహవేడుకకు రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరునగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డిలు హాజరై కొత్తజంటను ఆశీర్వదించారు. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరు వాస్తవ్యులు పచ్చా రవి - స్వర్ణలతల కుమార్తె **అనూష - శివప్రసాద్** (ఆదూరుపల్లి వాస్తవ్యులు అమ్మినేని రమణయ్యనాయుడు - పెంచలమ్మల కుమారుడు)ల వివాహం ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని వాయుగుండ్ల బ్రహ్మయ్య కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



నెల్లూరులోని వార్త ఫోటోగ్రాఫర్ మల్లెంబాక బాలసుబ్రహ్మణ్యంరెడ్డి(వెంకట్) - మహేశ్వరిల పరిణయం ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని డియస్ఆర్ కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# ఉగ్రరూపమెత్తిన ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునివ్వడంతో సీమాంధ్ర అంతటా స్థంభించి పోయింది. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, వ్యాపార సంస్థలన్నీ మూతపడు తున్నాయి. అన్నివర్గాల ప్రజలు బంద్‌కు సంపూర్ణంగా సహకరిస్తున్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు కూడా సమ్మెలో పాల్గొనడంతో 13జిల్లాల పరిధిలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయి ఆర్టీసీకి భారీనష్టం వాటిల్లింది. నగరాలు, పట్టణాలలోనే కాదు గ్రామీణ ప్రాంతా లలో సైతం ప్రజలు స్వచ్ఛందంగా ధర్నాలు, ర్యాలీలు, బంద్‌లు నిర్వహిస్తున్నారు. బంద్‌ల వల్ల తాము ఇబ్బంది పడుతున్నామనే బాధ ప్రజలలో కానరాకపోవడం విశేషం. ప్రతిజిల్లాలోనూ సమైక్యాంధ్ర ఉద్యమం శాంతియుతంగా జరుగుతుండడం ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయం. రోజులు గడిచి పోతే ప్రజలు చల్లబడిపోతారనేది కాంగ్రెస్ అధిష్టానం ఉద్దేశ్యంలాగుంది. కాని ప్రజలు రాష్ట్ర విభజన ప్రకటన వెనక్కి తీసుకునేవరకు ఎన్నిరోజులైనాసరే ఉద్యమాలను నిర్వహించడానికి సంసిద్ధంగా వున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు సమైక్యాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ ముందుకు నడిపిస్తున్నారు. ఉద్యమంలో ఏ మాత్రం పట్టుసడలనీయడం లేదు. తెలంగాణపై కేంద్రం ఎంత మొండిగా వ్యవహరి స్తుందో సమైక్యాంధ్ర ఉద్యమం విషయంలో కూడా సీమాంధ్రులు అంతకంటే మొండిగా వున్నారు. ఢిల్లీ పెద్దల గుండెలదిరే రీతిలో సమైక్యాంధ్ర ఉద్యమాన్ని మోత మోగిస్తున్నారు.

# మహానేతపై నిందలా?

(మొదటిపేజీ తరువాయి)

తన రాజకీయ స్వార్థం కోసం రాష్ట్ర విభజన విషయంలో చేయాల్సిన ఛండాలమంతా చేసేసి ఈరోజు ఆ పాపాన్ని దివంగత మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి పై మోపాలని చూస్తుంది. తెలంగాణ ఏర్పాటుకు వై.యస్.ను బాధ్యుణ్ణి చేసే కుట్రలకు పాల్పడుతోంది. తెలంగాణ ఏర్పాటు వై.యస్.రాజశేఖరరెడ్డి ఆశయమని ఆయన ఆశయం నెరవేరుతుంటే ఆయన కుటుంబసభ్యులు సంతోషించాలంటూ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దిగ్విజయ్‌సింగ్ దిక్కుమాలిన ప్రకటన ఒకటి చేసారు. ఈయన ప్రకటనకు రెండురోజుల ముందే ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా తెలంగాణ పాపం వై.యస్‌దేనంటూ సొల్లువాగుడు వాగాడు.

వై.యస్. వున్నంతకాలం రాష్ట్రంలో తెలంగాణ వాదం ముసుగేసుకుని పడుకుంది. ఉద్యమనాయకులు ఫామ్‌హౌస్‌లకు పరిమితమయ్యారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు సైతం వై.యస్. కనుసైగల్లో వున్నారు. 2004 ఎన్నికలలో తెలంగాణలో టీఆర్ఎస్‌తో పొత్తుకు వై.యస్. ససేమిరా అన్నారు. కాని కొందరు టి-కాంగ్రెస్‌నేతలు అధిష్టానంతో చెప్పించి టీఆర్ఎస్‌తో బలవంతపు పొత్తు కుదిర్చారు. ఆ ఎన్నికలలో తెలంగాణలో టీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌కే ఎక్కువ సీట్లు వచ్చాయి. అసలు పొత్తనేదిలేకుంటే టీఆర్ఎస్ సీట్లు కూడా కాంగ్రెస్‌కే వచ్చివుండేవి. కాంగ్రెస్-టీఆర్ఎస్‌ల మధ్య కుదిరిన పొత్తులో తెలంగాణ విషయంలో రెండోఎస్సార్సీ ప్రకారం పోవాలనే ఒప్పందమే వుంది. కాని కేసీఆర్ మాట తప్పి అప్పటికప్పుడు ప్రత్యేక తెలంగాణ కావాలంటూ అడ్డం తిరిగాడు. తనే కాక తన పార్టీ ఎమ్మెల్యేలచేత రాజీనామాలు చేయించడం, ఉపఎన్నికలకు పోవడం చేసాడు. ఇలా ఒకటికి రెండుసార్లు జరిగిన ఉపఎన్నికలలో టీఆర్ఎస్ దెబ్బతింది. తెలంగాణలో కేసీఆర్‌కు పెద్ద సీన్ లేకుండా చేసాడు వై.యస్. 2009 ఎన్నికలొచ్చేసరికి అధికారం మీద యావతో చంద్రబాబు కేసీఆర్‌తో పొత్తు పెట్టుకున్నాడు. ఆ పొత్తుతోనే కేసీఆర్‌కు 10అసెంబ్లీ సీట్లన్నా వచ్చాయి. లేకపోయివుంటే తెలంగాణలో టీఆర్ఎస్ తుడిచి పెట్టుకుపోయి వుండేది. ఆ ఎన్నికలలోనే వై.యస్... తెలంగాణ అంటూ ఏర్పడితే సీమాంధ్రులు వీసాతీసుకుని హైదరాబాద్ పోవాల్సివస్తుందని చెప్పి తన సమైక్యవాదాన్ని కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించాడు. రాష్ట్రం కలిసి వుండాలన్నది ఆయన కల. ఈరోజు ఆయనే వుండుంటే రాష్ట్రం చీలిపోయే పరిస్థితి వచ్చేది కాదు. రాష్ట్రం ఒక్కటిగానే వుండాలని ఆయన కోరుకుంటే తెలంగాణ ఆయన ఆశయమంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేయడం పెద్ద దుర్మార్గం.

# 'రెండుకళ్ల' ఆపరేషన్

(మొదటిపేజీ తరువాయి)

పొత్తు పెట్టుకున్నాడు. తెలంగాణలో కూడా దెబ్బ తిన్నాడు. ఆ తర్వాత కాలంలో తెలంగాణ వాదానికి తలవంచాడు. రెండుకళ్ల సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చాడు. తెలంగాణ ఇస్తే నాకు అభ్యంతరం లేదంటూ కేంద్రానికి లేఖ వ్రాసాడు. ఈయన తెలంగాణపై నిర్ణయం తీసుకునేటప్పటికే ఆ ప్రాంతంలోని పార్టీ కేడర్ చాలావరకు ఇతర పార్టీలలోకి వెళ్లి పోయింది. తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేసినందువల్ల ఇక ఆయనకు అక్కడ ఒరిగేదేమీ లేదు. ఇక తెలంగాణకు మద్దతుగా లేఖ ఇవ్వడంతో సీమాంధ్రలో ఆయన మీదున్న కసి రెట్టింపయ్యింది. వాస్తవంగా చంద్రబాబు లేఖ ఇవ్వకపోయివున్నా కాంగ్రెస్ ప్రత్యేకతెలంగాణ ప్రకటించి వుండేది. ఎందుకంటే ఇది వారి రాజకీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశం. చంద్రబాబు సమైక్యవాది గానే వుండుంటే ఈరోజు తెలంగాణలో పార్టీ బలహీనపడినా, సీమాంధ్రలో మాత్రం తెలుగుదేశం అనూహ్యంగా పుంజుకుని వుండేది. ఎందుకంటే తెలుగుదేశంకు సామాజికవర్గ సమీకరణాలను బట్టి చూస్తే ఓట్లు ఎక్కువగా వు[illegible]ంధ్ర జిల్లాల్లోనే! అనంతపురం, చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో పార్టీ ఇంకా బలపడి వుండేది.

ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలలో బలహీనంగా వున్నా, ఈ ఆందోళనల నేపథ్యంలో బలపడివుండేది. భవిష్యత్‌లో సీమాంధ్రలో వైకాపా, తెలుగుదేశంల మధ్యే అధికారం కోసం గట్టిపోటీ నెలకొని వుండేది.

# పూటకో మాట చెప్పే కాంగ్రెస్‌ను నమ్మొద్దు




సభలో ప్రసంగిస్తున్న మధు

తెలంగాణలో ఒక విధంగా, సీమాంధ్రలో మరో విధంగా పూటకోమాట చెప్పే కాంగ్రెస్‌ను నమ్మవద్దని, కాంగ్రెస్‌తో ఎన్‌జీఓలు కలిస్తే ఉద్యమం నాశనమవు తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి.మధు హెచ్చరించారు. సమైక్యాంధ్రప్రదేశ్ సిపిఎం వైఖరి అనే అంశంపై నగరంలోని కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆవరణంలో సిపియం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగసభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ తెలుగుజాతి శక్తిని చాటుదామన్నారు. మాజీ ఎమ్మెల్యే, సిపియం సీనియర్ నాయకుడు జక్కా వెంకయ్య మాట్లాడుతూ కొంతమంది నాయకులు తెలుగుజాతిని చీల్చే కుట్రపన్నారు. త్రాగునీరు, సాగునీరు, ఉద్యోగాలు, రాజధాని విషయంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం వుందన్నారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నగర కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు మోహన్‌రావు, శ్రీరాములు, జక్కా శేషమ్మ, చంద్రమౌళి, కత్తి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలధర్మం

# ఎస్.పి. బాలు మిత్రుడు విఠల్

ప్రముఖ చలనచిత్ర గాయకుడు ఎస్పీబాలసుబ్రహ్మణ్యం బాల్యమిత్రుడు, మేనేజర్ విఠల్(67) మంగళవారం మధ్యాహ్నం చెన్నైలో కన్నుమూశారు. ఈయన నెల్లూరువాసి. ఎస్పీ బాలుకు సహవిద్యార్థి. బాలుతో ఉన్న సాన్నిహిత్యంతో 1966లో చెన్నైకి వచ్చారు. అప్పటి నుంచి ఆరేళ్ళక్రితం వరకు బాలుకు మేనేజర్‌గా ఉంటూ వచ్చారు. ఆరేళ్ళక్రితం విఠల్‌కు పక్షవాతం వచ్చింది. 9రోజులక్రితం ఆయన శరీరంలో సోడియంశాతం పడిపోవడంతో చెన్నై వడపళనిలోని విజయాఫౌండేషన్ ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం విఠల్ కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం చెన్నై నుంగంబాక్కంలోని శ్మశానవాటికలో జరిగాయి. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

PDF Compressor Free Version




# గూడూరు డివిజన్ వార్తలు

సమైక్యాంధ్ర కోసం...

## రోడ్డెక్కిన ఉద్యోగులు




గూడూరులో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సమైక్యాంధ్రపోరులో విద్యార్థులు, జేఏసీ నాయకులు ఆందోళనలు కొనసాగించారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమాలను వర్షంలోనే నిర్వహించారు. ముందుగా కెఎంఆర్ కాన్సెప్ట్ స్కూలు విద్యార్థులు ఐనిగిసాహెబ్ సెంటర్ నుంచి ప్రదర్శనగా వివేకానందరోడ్డు మీదుగా టవర్‌క్లాక్ సెంటర్ చేరుకొని అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. గంట పాటు ట్రాఫిక్‌ను స్తంభింపచేశారు. తరువాత టవర్‌క్లాక్ వేదికగా జేఏసీ నాయకులు కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. దీక్షా శిబిరంలో జేఏసీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పాశం సునీల్ కుమార్, నాశిన నాగులు, మస్తానయ్య,



జేఏసీ నేతల కబడ్డీ

వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర సమైక్యంగా ఉండే వరకు ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. వరుస క్రమంలో వ్యాపార, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, రాస్తా రోకోలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్ర మాలు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచుతామని ప్రకటించే వరకు ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో వాసుగౌడ్, కడివేటి చంద్రశేఖర్, మల్లు విజయ కుమార్‌రెడ్డి, గూడూరు రాజేశ్వరరెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పాక పెంచలయ్య పాల్గొన్నారు.

## పెట్రోలు బంకుల వద్ద బారులుతీరిన ప్రజలు

గూడూరు పట్టణంలో పెట్రోలు బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. సమైక్యాంధ్రకు మద్దతుగా మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన పెట్రోలు బంకు యజమానులు సోమవారం నుంచే పెట్రోలు పట్టడం నిలిపివేశారు. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బంకుల్లో పెట్రోలు స్టాకులేదని సిబ్బంది తెలపడంతో వాహన చోదకులు అసహనం వ్యక్తంచేశారు.

బంద్‌ను దృష్టిలో పెట్టుకొని బ్లాక్‌లో విక్రయాలు సాగించేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రజలు ఆరోపించారు.



పెట్రోలు లేదనడంతో అసహనం వ్యక్తంచేస్తున్న వాహనచోదకులు

## వైయస్సార్‌సీపీ సర్పంచ్‌లకు అభినందనలు

గూడూరు మండలంలో 4పంచాయతీలు, చిల్లకూరులో ఒక పంచాయతీ, వాకాడులో ఒకటి, చిట్టమూరులో ఒకటి మొత్తం 7పంచాయతీల సర్పంచ్‌లకు గూడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన విజయకుమార్ అభినందనలు తెలిపారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలు, అభిమానుల సహాయ సహకారాలతో ఈ విజయం సాధించారని ఆయన "లాయర్"తో అన్నారు. ఇంకా గూడూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన ప్రతి ఒక్క సర్పంచ్‌కు, వార్డు మెంబర్లుకు కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు వారు "లాయర్" ద్వారా అభినందనలు తెలుపుతున్నట్లు, రాబోయే మున్సిపల్, ఎంపిటీసీ, జడ్‌పిటీసీలో, ఎంఎల్‌ఏ, ఎంపి ఎన్ని కలలో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అందరినీ ప్రార్థిస్తున్నట్లు "లాయర్"కు తెలిపారు.



ఓటర్ల జాబితాలను

## పారదర్శకంగా రూపొందించాలి



ఓటర్ల జాబితాపై తహశీల్దార్ మైత్రేయతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓటర్ల జాబితాలను పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు నాశిన నాగులు, మల్లు విజయకుమార్‌రెడ్డిలు సోమవారం గూడూరు తహశీల్దార్ మైత్రేయకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు జరగనున్న తరుణంలో బీఎల్‌వోలతో ఓటర్ల జాబితాలను రూపొందించారన్నారు. కొందరు రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా లేనివారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌వోలపై ఒత్తిడి తీసుకొచ్చి ఓట్లను తొలగిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయమై పర్యవేక్షించి అవకతవకలను అరికట్టాలని వారు కోరారు.

కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో

## ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధిపరచాలి

కార్పొరేట్ పాఠశాల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచాలని ఒకటవ పట్టణ ఎస్ఐ షేక్ షరీఫ్ అన్నారు. సోమవారం గూడూరు శివాలయం వీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ సభ్యుడు కడివేటి చంద్రశేఖర్ దాతృత్వంతో 100 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యార్థి గుర్తింపుకార్డులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సభ్యులు ఉచితంగా విద్యార్థి గుర్తింపుకార్డులను పంపిణీచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కె. చంద్రశేఖర్, మల్లు విజయ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూ'వీ'క్షణం



## 'క్రిమినల్స్'లో నిషా

'మంత్ర' దర్శకుడు ఓషో తులసి రామ్‌తో 'మంగళ' చిత్ర నిర్మాత సి.హెచ్.వి.శర్మ ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'క్రిమినల్స్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ నిషా కొఠారి ప్రధాన పాత్ర పోషిస్తోంది. సైబర్ క్రైమ్ నేపథ్యంలో సాగే కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సెప్టెంబర్ రెండో వారంలో ఈ చిత్రానికి సంబంధించి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తారు. హైదరాబాద్, తలకోన, బ్యాంకాక్ తదితర ప్రాంతాల్లో షూటింగ్‌ను చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం 'మంత్ర' ఆనంద్ సమకూర్చనున్నారు.



## 20న 'తుఫాన్' ఆడియో

రామ్‌చరణ్‌ను బాలీవుడ్‌కు పరిచయం చేయనున్న 'తుఫాన్' సినిమా ఆడియోని ఆగస్టు 20న హైదరాబాద్‌లో విడుదల చేయనున్నారు. హిందీలో 'జంజీర్'గా, తెలుగులో 'తుఫాన్'గా ఈ సినిమాని నిర్మించారు. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఆడియో విడుదల విషయాన్ని నిర్ధారిస్తూ ట్విట్టర్‌లో తెలియజేసారు. ఈ ఆడియో వేడుకలోనే న్యూప్రోమోస్, టీజర్, పోస్టర్స్‌ను విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది. ప్రియాంకచోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్‌లో విడుదల కానుంది. తెలుగువర్షన్‌లో కొన్ని మార్పులు చేయడం జరిగింది.



## డబ్బింగ్ చెబుతున్న రామ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ – విక్టరీ వెంకటేష్‌తో కలిసి నటిస్తున్న మల్టీ స్టారర్ సినిమాకి డబ్బింగ్ మొదలైంది. 'బోల్‌బచ్చన్' సినిమాకి రీమేక్‌గా వస్తున్న ఈ సినిమా టైటిల్ 'మసాల'. కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకి విజయ్‌భాస్కర్ దర్శకత్వం వహిస్తున్నాడు. "ఈ సినిమా డబ్బింగ్ మొదలుపెట్టాను. సాధారణంగా సినిమా చూస్తూ నేను నవ్వను. కాని ఈ సినిమా చూసి నవ్వాను. ఈ సినిమా మీరు చాలా ఎంజాయ్ చేస్తారనే నమ్మకం నాకు ఉంది" అని రామ్ ట్వీట్ చేశాడు. సరస్వతి రవి కిషోర్ – సురేష్‌బాబు కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదలకానుంది.



## ఎన్నికలకు మేం సిద్ధం

2014లో జరగనున్న ఎలక్షన్స్ రాజకీయ నాయకులకే కాదు ఇండస్ట్రీకు సైతం చాలా కీలకం కానున్నాయి. ఈ ఎలక్షన్స్‌లో కొందరు సినీప్రముఖులు అసెంబ్లీ, లోకసభ సీట్ల రేస్‌లో వున్నారు. టీడిపి నుండి బాలకృష్ణ ఎన్నికల బరిలో దిగే అవకాశాలు పుష్కలంగా వున్నాయి. చిరంజీవి సెంట్రల్‌మినిస్టర్ హోదాలో వున్నాడు. వి.వి.వినాయక్ రాజమండ్రి నియోజకవర్గంలో నిలబడనున్నాడని వార్త వినిపిస్తుంది. శ్రీహరికి కాంగ్రెస్ తరపున టికెట్ లభించనుందని సమాచారం.

PDF Compressor Free Version



# నారాయణ వారి పెళ్ళిసందడి





కొత్తదంపతులతో నారాయణ దంపతులు మరియు కుటుంబసభ్యులు

## సింధూర - పునీత్

దేశమే గర్వించే స్థాయిలో తన విద్యాసంస్థలను నలుదిశలా విస్తరింపజేసిన నెల్లూరు 'నారాయణ' విద్యాసంస్థల అధినేత పి.నారాయణ-శ్రీమతి రమాదేవిల కుమార్తె **సింధూర - పునీత్**(కర్నాటక కేడర్ సీనియర్ ఐపిఎస్ అధికారి, బెంగుళూరు వాస్తవ్యులు కొత్తప బిపిన్ గోపాలకృష్ణ - పద్మజల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 11వ తేదీన నెల్లూరురూరల్ మండలం చింతారెడ్డిపాళెంలోని నారాయణ వైద్యకళాశాల ఆవరణలో అత్యాధునికంగా ఏర్పాటుచేసిన కల్యాణవేదికలో అంగరంగవైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రులు పితాని సత్యనారాయణ, కొండ్రు మురళి, దానం నాగేందర్, పి.బాలరాజు, ఘంటా శ్రీనివాసరావు, సిబిఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సహకారహక్కుచట్టం కమీషనర్లు జన్నత్‌హుస్సేన్, విజయలక్ష్మి, నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, శాసనసభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసా రత్నం, కురుగొండ్ల రామకృష్ణ, కోడెల శివప్రసాద్, గాలి ముద్దుకృష్ణమనాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వైకాపా నాయకులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి ఎన్.రామమోహన్‌రావు, ఇంకా వివిధ రంగాల ప్రముఖులు పెద్దసంఖ్యలో విచ్చేసి వధూవరులను దీవించారు. కొత్త దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.






# మోడీ... మోత మోగించాడు



*నరేంద్ర మోహన్‌దాస్ మోడీ.... బాలీవుడ్ సూపర్‌స్టార్ కాదు... టాలీవుడ్ టాప్‌హీరో కాదు... స్వాతంత్ర్య సమరయోధుడూ కాదు... మరి అతనిని చూడ్డానికి, అతను చెప్పేది వినడానికి లక్షలాదిమంది ప్రజలు ఎగబడ్డారు. టిక్కెట్ కొని హిట్‌సినిమా చూసినట్లుగా ఐదురూపాయలు వెచ్చించి అతని సభకు వెళ్లారు. లక్షలాదిమంది ప్రత్యక్షంగాను, కోట్లాదిమంది టీవీల ద్వారా పరోక్షంగానూ ఆయన ప్రసంగాన్ని తిలకించారు. మరి ఏ గ్లామర్ లేని మోడీ అంటే ప్రజలకు ఎందుకింత అభిమానం... ప్రజలు ఎందుకు ఆయన ప్రధాని కావాలని కోరుకుంటున్నారు?*


ఎందుకంటే ఆయన అభివృద్ధికి రోల్‌మోడల్. ప్రజాప్రతినిధులు ఎలా వుండాలి, ఎలా నడుచుకోవాలనేదానికి ఉదాహరణ. ప్రజల అభివృద్ధి కోసమే పనులైనా పథకాలైనా అనేది ఆయన పాలసీ. అంతేగాని ప్రజల ఓట్ల కోసం పథకాలను పెట్టకూడదనేది ఆయన ఫిలాసఫీ. ఆధునిక భారతావనిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ కోట్లాదిమంది యువత హృదయాలకు చేరువైన నాయకుడాయన. రూపాయికి కిలో బియ్యం వంటి దండగమారి పథకాలకు ఆయన దూరం. ప్రజలను శాశ్వత అభివృద్ధి బాటలో నడిపించే ఎన్నో బృహత్తర పథకాల రూపశిల్పి ఆయన. అన్నింటికి మించి ఆయన పేరు మోసిన రాజకీయ కుటుంబం నుండి రాలేదు. గొప్ప వంశంలో పుట్టలేదు. నిరుపేద బలహీన కుటుంబంలో పుట్టాడు. తమ సొంత టీక్యాంటీన్‌లో పనిచేసుకుంటూ పెరిగాడు. ఈరోజు దేశ ప్రధానికాగల అర్హతలున్న నేతల్లో అగ్రస్థాయి నేతగా ఎదిగాడు. కాబట్టే ప్రజలు ఈ సాధారణ పౌరుడినే ప్రధానిగా ఆకాంక్షిస్తూ అభిమానిస్తున్నారు.

భారతీయ జనతా పార్టీ ప్రచారసారధిగా బాధ్యతలు చేపట్టాక నరేంద్ర మోడీ తన ప్రచార శంఖారావాన్ని హైదరాబాద్‌లోనే మోగించారు. ఈ నెల 11వ తేదీన ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన 'నవభారత యువభేరి' సదస్సుకు ప్రజలు పోటెత్తినట్లు వచ్చారు. వచ్చిన వారిలో 90శాతం మంది 40 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. మోడీ ప్రసంగం సభికులనే కాకుండా టీవీల ద్వారా చూస్తున్న వారిని కూడా ఉత్తేజితుల్ని చేసింది. తెలుగులో తన ఉపన్యాసాన్ని ప్రారంభించి తెలుగులోనే రెండు నిముషాలు మాట్లాడిన మోడీ తెలుగువారి హృదయాలకు మరింత చేరువయ్యారు. తెలంగాణ, సీమాంధ్రకు సమప్రాధాన్యత నిస్తూ, ఈ రెండు ప్రాంతాలను గుజరాత్ కంటే మిన్నగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పలుమార్లు ఎన్టీఆర్ పేరును స్మరిస్తూ కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వాల ఏర్పాటుకు ఆద్యుడు ఎన్టీఆర్ అని తెలుగుదేశంపార్టీ ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చి, ఆ పార్టీలో కూడా కదలిక వచ్చేలా చేసాడు. దేశభద్రత, చొర బాట్లు, అవినీతి వంటి విషయాలలో కేంద్రప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మోడీ చేసిన ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసేదిగా వుంది. మొత్తానికి హైదరాబాద్ నుండి మోడీ తొలి అడుగువేసాడు. అది సూపర్‌సక్సెస్ అయ్యింది. ఈ అడుగులు ఇక ఢిల్లీవైపు సాగాల్సివుంది.



వృద్ధురాలు మేరీసింగ్‌కు పాదాభివందనం చేస్తున్న నరేంద్ర మోడీ

# జగన్‌పై కక్ష... జనానికి శిక్ష



రాష్ట్ర విభజనకు కారణమేంటి? అన్ని పార్టీలు తెలంగాణకు అనుకూలంగా చెప్పడమేనా? లేక తెలంగాణలో ఉద్యమాలకు భయపడా? ఇవేవీ కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించలేవు. ఆందోళనలకు భయపడి విభజన అనే తేనెతుట్టెను కదపాల్సిన అవసరమే కాంగ్రెస్ అధిష్ఠానానికి లేదు. కేవలం జగన్ మీదవున్న కసి, సీమాంధ్రలోని జనం మీదున్న కోపంతోనే సోనియాగాంధీ రాష్ట్ర విభజనకు పచ్చజెండా ఊపింది. వై.యస్. మరణించకపోయి వున్నా, ఒకవేళ మరణించిన తర్వాత జగన్ కాంగ్రెస్‌లోనే వున్నా రాష్ట్ర విభజన జరిగి వుండేదికాదు. ఇది అక్షరసత్యం. జగన్ మూలంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ తుడిచిపెట్టుకుపోయే పరిస్థి[illegible]రికి సోనియా ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం.

రాష్ట్రంలో జగన్ బలపడడం, కాంగ్రెస్ బలహీనపడడం ఆమె తట్టుకోలేకపోయింది. వై.యస్.కు గాని, జగన్‌కు గాని ఇంతటి ఇమేజ్ రావడానికి ప్రధానకారణం కాంగ్రెస్ పార్టీయేననేది ఆమె ఉద్దేశ్యం. కాని జగన్ కాంగ్రెస్ నుండి వెళ్లిపోయి రాష్ట్రంలో ఆ కాంగ్రెస్‌కే సవాల్‌గా మారాడు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పెట్టాక రాష్ట్రంలో జరిగిన ఉపఎన్నికలు కూడా సోనియాలో విపరీత ఆలోచనలు నాటుకునేందుకు సహకరించాయి. కడప లోక్‌సభ, పులివెందుల అసెంబ్లీకి ఉపఎన్నికలు జరిగితే కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదు. నెల్లూరు లోక్‌సభతో పాటు 18అసెంబ్లీలకు ఉపఎన్నికలు జరిగితే కాంగ్రెస్ రెండుచోట్ల మాత్రమే నెగ్గగా మిగిలిన స్థానాలలో వైకాపా అభ్యర్థులు బంపర్ మెజార్టీతో గెలిచారు. ఇదే సోనియాకు మింగుడుపడలేదు.

ఇంకో ముఖ్య కారణం రెడ్డి సామాజికవర్గం కాంగ్రెస్‌ను వదిలి వైయస్సార్ కాంగ్రెస్ వెంట పోవడం. రాష్ట్రంలో కాంగ్రెస్ అంటేనే రెడ్ల పార్టీ. కాంగ్రెస్ అధికారంలో వున్నప్పుడంతా ముఖ్యమంత్రులుగా చేసింది వాళ్లే. పి.వి.నరసింహారావు, జలగం వెంగళరావు, దామోదరం సంజీవయ్యలు మాత్రమే నాన్‌రెడ్లు. కాని వై.యస్. మరణించాక పరిస్థితి మారిపోయింది. సీమాంధ్రలో 'రెడ్డి' వర్గం నాయకులతో పాటు ప్రజలు కూడా వైకాపా వైపు వెళ్లిపోయారు. ఇప్పుడు వైకాపా రెడ్లపార్టీగా ముద్రపడింది. ఇంతకాలం కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా వున్న రెడ్లు ఒక్కసారిగా వైకాపా వైపు పోవడంతో సోనియాగాంధీ జీర్ణించుకోలేకపోయింది. దాంతో జగన్ మీద, అతని వెంట నిలిచిన సీమాంధ్ర జనం మీద కక్ష తీర్చుకోవడానికి మొండిగా విభజనకు పూనుకుంది.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.